AL - HiLaL

నవతరం

రజబ్ మాస్ర్ శకం 1433

Vol 8, Issue: 68 June - 2012 nelavankaonline.com مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى



పాశ్చాత్య - పాశ్చాత్య

న్యూ ముస్లింలు, అరబ్బేతర ముస్లింల కొరకు దివ్యఖుర్ఆన్ కంఠస్థ హోటేలు

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

جمعية النجاة الخيرية

JUN 2012.indd 1 6/4/12 11:53 AM

తల్లి రుణం తీరేదెన్నడు?

"మరి మేము మానవునికి అతని తల్లిదండ్రుల విషయంలో గట్టిగా తాకీదు చేశాము. అతని తల్లి అతన్ని ప్రయాసపై ప్రయాస ఓర్చుకుంటూ తన గర్భంలో మోసింది. మరి అతని పాలు విడిపించడానికి రెండు సంవత్సరాలు పట్టింది. (కనుక ఓ మానవుడా!) నువ్వు నాకూ, నీ తల్లిదండ్రులకూ కృతజ్ఞుడవై ఉండు. (ఎట్టకేలకు మీరంతా) మరలి రావలసింది నా వద్దకే". (దివ్యఖుర్‌ఆన్- 31: 14)



అమ్మ ప్రాణాలన్నీ కడుపులోని కసుగాయ మీదే! ఆ తొమ్మిది నెలలు తనకంటూ ఇష్టాలుండవు. ఉన్నా వదిలేసుకుంటుంది. బిడ్డకు ఏం అవసరమో అదే తింటుంది.బిడ్డకు ఏది క్షేమమో అదే చేస్తుంది. నిద్రలోనూ పసిగుడ్డు ధ్యాసే! లోలోపల కదిలిక సవ్వడి చాలు...మురిసిపోతుంది...మెత్తని పాదాల తాడికి పులకరించిపోతుంది. అందుకే **'తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంది'** అన్నారు ప్రవక్త మహనీయులు (స). ప్రేమ ప్రస్తావన వచ్చినప్పు **'70 తల్లుకంటే అధిక ప్రేమ గలవాడు అల్లాహ్'** అన్నారు. నా సేవకుఎక్కువ అర్హులు ఎవరు? ప్రశ్నించినప్పుడు--**'నీ తల్లి, నీ తల్లి, నీ తల్లి'** అని మూడు సార్లు నొక్కి వక్కాణించారు.

అమ్మ అన్న పదం కన్నా కమ్మనైన మాట ఈ లోకంలో మరొకటి ఉండదు. బాబు కారం తినలేడు, పాపకు పాయసం అంటే ఇష్టం... అమ్మ కొసరి కొసరి వడ్డించేది అన్నమో, కూరో కాదు - అమ్మ మనసు! అందుకే **'అమ్మ లేని ఇల్లు శ్మశానంతో సమానం'** అన్నారు అమ్మ విలువ తెలిసిన హజ్రత్‌లుఖ్మాన్ హకీమ్(ర). అమ్మ ఏ జీతం తీసుకోని ఓ పని మనిషి, ఓ చీఫ్ ఎగ్జిక్యుట్ ఆఫీసర్, ఓ వ్యక్తిత్వ వికాస నిపుణురాలు, ఓ పంతులమ్మ, ఓ బోధకురాలు, ఓ స్నేహితురాలు, ఓ మంచి రాయబారి, ఓ అమ్మమ్మ, ఓ నాయనమ్మ.





పిల్లలు పెరిగి పదార్థ పూజారులుగా మారుతున్న నేటి తరుణంలో **'అమ్మ శ్రమను అంకెల్లో చెబితే..... 10000000000000000000000000000.....'** అక్షరాల అనంతం. అనంతాన్ని కొలవగలిగే మేధావులే అయినా...అపారమైన మొత్తాన్ని చెల్లించగల కుబేరులే అయినా...ప్రసవ వేదనతో ఆమె పెట్టిన ఒకే ఒక్క కేకకు బదులు తీర్చుకోలేరు. **'మిత్ర రుణం తీర్చలేక పోయాను'** అని అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారే సెలవిచ్చినప్పుడు **'మాతృ రుణాన్ని'** తీర్చగలవారెవరుంటారు చెప్పండి. మనకు ప్రాప్తమయి ఉన్న సౌఖ్యాల వెనుక ఉన్నవి అమ్మ దీవెనలే కదా!

NIDAVANKA

సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

AL-HILAL
వెలువరిక
(AL-HILAL MONTHLY)

Vol 8, ISSUE: 68
June - 2012

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97266676

FAX
22400057


P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
ISLAM PRESENTATION COMMITTEE
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw


DESIGN
Nader Belal

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net

ఈ సంచికలో....



మేరాజ్ సందేశం



ఆహారపానీయాలు - ఆచారనియమాలు



మాట - మౌనం



పాల ప్రాశస్త్యం

పాల గురించి ఎంత చెప్పినా తక్కువే. అదో కడలి....పాల కడలి. పాలకు మించిన ఎనర్జీ డ్రింక్ లేదు. చెడు క్రిములని నివారించడంలో, మంచి పోషకాలను కాపాడటంలో పాల పాత్ర కీలకం. పాల విశిష్టతను తెలియ జేస్తూ దైవ అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు: "ఎవరికైనా అల్లాహ్ ఏదైనా ఆహారపానీ యాన్ని తినిపిస్తే అతను - 'ఓ అల్లాహ్! మాకు ఇందులో శుభాన్ని ప్రసాదించు. దీనికన్నా మేలిమి ఆహా రాన్ని అనుగ్రహించు' అని దుఆ చేయాలి. ఎవరికైతే అల్లాహ్ పాలు తాపిస్తాడో వారు - 'ఓ అల్లాహ్ మాకు ఇందులో శుభాన్ని ప్రసాదించు. దీన్ని మరింత అధికంగా మాకనుగ్ర హించు' అని దుఆ చేయాలి. ఆహారపానీయాల్లో శ్రేష్ఠతరమైనది పాలు" అని ప్రార్థించాలి అన్నారు. (సిల్సిలతుస్సహీహా)

మేరాజ్ సందేశం	2	ఇస్లాం సంస్కృతి-శిక్షాస్మృతి	12
దైవాజ్ఞ అన్నింటికంటే విలువైనది	3	ఖుర్ఆన్ పోటీలు	14
ఆహారపానీయాలు.....	4	ముస్లిం జీవితానికి సంబంధించిన....	17
కువైట్ ఆకర్షణా కేంద్రాలు	6	ఇస్లాం పిలుపు	18
వాత్సల్యం-మాత్సర్యం	8	మాట మౌనం	20
ఐపిసి వార్తలు	11	సమాజానికి పట్టిన చీడ వడ్డీ పీడ	22
		పాకశాల....	24

رسالة المعراج - سلعة الله الغالية - عادات وتقاليد في المأكولات والمشروبات - الأماكن الترفيهية في الكويت - التخلية ثم التحلية - أخبار اللجنة - التوازن الحميد بين العاطفة والعقل الرشيد - مسابقة القرآن الرهيماني- خذ عقيدتك - رسالة الإسلام - فليقل خيراً أو ليصمت - الربا كارثة للمجتمع - الطبخ الكويتي - الأدب مع رسول الله صلى الله عليه وسلم

మేరాజ్ సందేశం

నింగికి నిచ్చెన - మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారి గగన ప్రయాణం (మేరాజ్)ను పురస్కరించుకుని ప్రపంచమంతటా మరొకసారి సభలు, సమావేశాలు పెట్టుకున్నాము. మరి ఈ సందర్భాన మనలో ఏ విధమైనటువంటి మార్పు అయినా వచ్చిందా? ఈ శుభ ఘడియల్లో మన సముదాయం మేరాజ్ అంతటి ఎత్తుకు ఎలా ఎదగలదో? ఏకాంతంలోనయినా ఎకాగ్రతతో ఆలోచించామా? లేదా కేవలం సంబరాలు చేసుకొని సరదాగా సమయాన్ని వృధా చేయడమే మేరాజ్ పరమార్థమా? గత జ్ఞాపకాలు మన కళ్ళ ముందు కదలాడాలి. మనలో అంతరించిన భావ చైతన్యం తిరిగి చిగురించాలి. మనం మారాలి, మన ఆలోచనా రీతులూ మారాలి. మన సమాజపు పరిస్థితి మారాలంటే - సాత్వికంగా, సవ్యంగా, సత్యబద్ధంగా ఆలోచించేందుకు మన అంతరాత్మను పరిశుద్ధ పర్చుకోవాలి. సద్గ్రంథ పఠనం, సద్వచన శ్రవణం, సద్గుణ సంచయం, సత్సాంగత్యం ద్వారా అంతరాత్మ పునీతమవుతుంది. అశుద్ధమయిన అంతరాత్మే మనలో నిజ తత్వాన్ని కప్పి పుచ్చి ఈ భౌతిక లోకమే శాశ్వతమయినదిగా, అంతకు మించి వేరొకటి లేనట్లుగా భ్రమింపజేస్తుంది. అశుద్ధ అంతరాత్మ అత్యుత్తమ లక్ష్య సాధనా మార్గంలో అవరోధం కల్పించి మనం మారకుండా, మన పరిస్థితులు మారకుండా, మన అవస్థలన్నింటికి కారణభూతమవుతుంది. మనసు ప్రశాంతమయినప్పుడు, సంకల్పం నిశ్చలమయినప్పుడు అవరోధాలు తొలగి ఆంతర్వాణి పలకడం ప్రారంభమవుతుంది. అది విజయ సాధనలో వినూత్న ఉత్సాహాన్ని, రెట్టింపు బలాన్నిస్తుంది. నక్షత్రాల ఆవల లోకానికి నిచ్చెలు వేయగలగే ధైర్యాన్ని, మనోస్థయిర్యాన్నిస్తుంది.

నరలోకం తీరు - ఈ అవని సత్యాసత్యాల, న్యాయాన్యాయాల, ధర్మాధర్మాల, మంచిచెడుల నిలయం అవడం అల్లామ్ అభిష్టం ప్రకారమే జరిగింది. ఇక్కడ ప్రతీది తనవంతు తానే సత్యమని, తానే నెగ్గాలని తీవ్ర ప్రయత్నం చేస్తుంది. కనుకనే కొన్ని సందర్భాల్లో అసత్యం జయించినట్లు, అధర్మం నెగ్గినట్లు, అన్యాయం పెచ్చరిల్లినట్లు, దానవత్వం, దుర్మార్గం, దౌర్జన్యం రాజ్యమేలినట్లు కనిపిస్తుంది. కాని అంతిమ విజయం మాత్రం సత్యానిదే, అగ్ర తాంబూలం మాత్రం ధర్మానికే.

నిందారోపణ - 'అవినీతి అధికంగా ఉన్న చోట స్వేచ్ఛ మనజాలదన్నట్లు' తమ అవినీతిని, తప్పుడు పద్ధతుల్ని, నికృష్ట మనస్తత్వాన్ని కప్పి పుచ్చుకోవడానికి ప్రతి యుగంలోనూ గుత్తాధిపత్యం గల వ్యక్తులు, శక్తులు ఎదుటి వారి స్వేచ్ఛకు తూట్లు పొడవడానికి ప్రయత్నించారు. వారి నోళ్ళను నొక్కేయ్యాలని, వారి హక్కులను మెక్కెయ్యాలని మంతనాలు జరిపారు. నిషేధాజ్ఞలు విధించి వారి బ్రతుకుల్ని అస్తవ్యస్థం చేశారు. కాని ఈ ఆంక్షలు సృజనకారుల్ని, సంస్కర్తల్ని, సంఘ శ్రేయోభిలాషుల్ని ఏమీ చేయలేకపోయాయి. నాడే కాదు నేడు కూడా అధికార దండ చేతిలో ఉన్న వారు సామ, దాన, భేద, దండోపాయాలతో సత్యప్రియులను, సత్యధర్మ ధ్వజవాహకులను గదమాయించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. వారి తన, మాన, ధనాలతో చెలగాటమాడుతూనే ఉన్నారు. వారి సంప్రదాయాల్ని, ఆదర్శ వ్యక్తుల్ని, అభిమాన గ్రంథాల్ని అవహేళన చేస్తూనే ఉన్నారు. ఇంత జరిగినా, మరెంత జరిగినా సత్యం విశ్వాసికి మొదటి శ్వాస. అది మన రక్తపు సజీవ భాష. నిత్య అభ్యాస. భూమి నుండి మనం మన అడుగు తీసే వరకూ నిలుపుకోవాల్సిన ఒకే ధ్యాస. కువైట్ ప్రభుత్వం మే 3-2012న జారీ చేసిన శాసనంలో **'సద్గ్రంథం ఖుర్ఆన్‌ను, సత్యవక్త ముహమ్మద్ (స)ను, విశ్వాసుల మాతలయిన ఆయన (స) సతీమణులను అవహేళన చేసే వ్యక్తికి మరణ దండన విధించవసింగా పేర్కొనడం. అలాగే 'నేను ప్రవక్తను' అనే ప్రకటించుకునేవారిని సయితం మృత్యు దండన అమలుపర్చాల'**ని ఆదేశించడం ఎంతో ముదావహం. నిజంగా ఇది వాన పాములాంటి శక్తుల, ఉక్తుల, వ్యక్తుల గుండెల్లో గుళ్ళ సౌండింగే.

నీతి నడవడిక - మేరాజ్ సందర్భంగా మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారికి అల్లామ్ చూపిన దృశ్యాలు మానవకు, ముఖ్యంగా విశ్వాసులకు నీతిని నేర్పే గుణపాఠాలు. మనలో దైవభక్తిని, నైతిక రీతిని, పరలోక భీతిని, స్వర్గ ప్రీతిని, ప్రవక్త (స) రీతిని పెంపొందించి, అవాంఛనీయమయిన, అపరిశుద్ధమయిన ఉక్తులను, శక్తులను అంతమొందించే అద్భుత ప్రక్రియ నమాజు ఈ సందర్భంగానే మనకు ప్రాప్తమయింది. కాబట్టి మనలో నమాజు పట్ల నిర్లక్ష్యతను, బద్ధకాన్ని చోటివ్వకూడదు. తల్లిదండ్రుల యెడల సత్ప్రవర్తన కలిగి ఉండాలి. దుబారా ఖర్చుకు దూరంగా ఉండాలి. మనకు తెలియని విషయాల వెంట పడకూడదు. లేమి భయంతో మన సంతానాన్ని మనం చంపుకోకూడదు. చిన్న చీమనయినా అన్యాయంగా బలిగొన కూడదు. మనలో ప్రాపంచిక వ్యామోహం, పిసినారితనం పాడసూపకూడదు. నెరవేర్చలేని బాధ్యతాభారాన్ని మన మీద మనం వేసుకోకూడదు. మనం బాధ్యతారహితంగా ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి సమాజంలో ఆరాచకానికి కారకులం కాకూడదు. మనం సత్యాన్ని సర్వవ్యాప్తం చేసేవారిగా ఎదగాలేగానీ, చెడును సర్వసామాన్యం చేసే స్థాయికి దిగజారకూడదు. మన మాటల వల్లగానీ, చేతల వల్లగాని ఎవరికి ఏ విధ మయినటువంటి హాని కలుగకూడదు. మనం ప్రజల తన, మాన, ధనాలకు రక్షకులుగా ఉండాలే గానీ, భక్షకులుగా కాదు. ఒకరి ధనాన్ని, స్థలాన్ని, ఉద్యోగాన్ని అన్యాయంగా స్వాహా చేయకూడదు. పేదవాడి నడ్డి విరగ్గొట్టే వడ్డీ అడ్డమైన గడ్డి తినకూడదు. అక్రమ సంబంధానికి, స్వలింగ సంపర్కానికి పాల్పడకూడదు. స్వామీ ద్రోహులయిన సహవర్తులను సహించకూడదు. భరించకూడదు.

నిష్ఠ నిర్వచనం - దైవ మార్గంలో ప్రతిఘటిస్తున్న శక్తులు, మనల్ని దేవుని అభీష్టానికనుగుణంగా నడవకుండా నిరోధిస్తున్న శక్తులు, సత్య మార్గం నుండి తప్పించాలని చూస్తున్న శక్తులు, మనల్ని సంపూర్ణ దైవ దాసులుగా జీవించనివ్వని శక్తులు, మిథ్యా వాదాల్ని, దైవాల్ని నమ్మడం తప్ప గత్యంతరం లేకుండా చేస్తున్న శక్తులు-వీటన్నింటినీ ఎదిరించి మనకు సాధ్యమయిన బలాన్ని కూడదీసుకుని సంఘర్షణ, కృషి, ప్రయత్నాలు జరపాలి. **ఒక వైపున దుష్టుడయిన షైతాన్, అతని సేనలున్నాయి; రెండవ వైపున మనిషి సొంత మనస్సు అతని కల్లెం లేని కాంక్షలున్నాయి; మూడవ వైపున మనిషితో రకరకాల సామాజిక, నాగరిక, ఆర్థిక సంబంధాలు కలిగిన దైవ ధిక్కారులయిన అసంఖ్యాక శక్తులున్నాయి; నాల్గ వైపున దైవ ధిక్కారం ఆధారంగా ఏర్పడిన, సత్య దాస్యానికి బదులుగా మిథ్యా దాస్యాన్ని మనిషి ఆచరించేలా చేసే దోషభూయిష్టమయిన మత, నాగరిక, రాజకీయ వ్యవస్థలున్నాయి. వీటన్నింటి ఆయుధాలు వేర్వేరయినప్పటికీ లక్ష్యం ఒక్కటే - మనిషిని దైవానికి బదులు తమకు విధేయుడిగా చేసుకోవడమే; నాటి ఫిర్‌ఔన్, నమ్రూద్ మొదలు నేటి నియంత, నిరంకుశవాదుల వరకూ.**

కాబట్టి మనం సత్యమార్గంలో సఫలీకృతులం అవ్వాలంటే, ధర్మానికి వ్యతిరేకంగా ఎదురయ్యే శక్తులన్నింటినీ ఒకేసారి ప్రతిఘటిస్తూ పోరాడాలి. సతతం, సర్వావస్థల్లో వాటితో సంఘర్షణకు సిద్ధమవ్వాలి, అవాంతరాలన్నింటినీ కాలరాచి దైవమార్గంలో ముందుకే సాగుతూ పోవాలి. ఈ అవిరళ కృషిపైనే, ఈ అవిశ్రాంత పరిశ్రమపైనే మన సాఫల్యకృతార్థతలు, దైవంతో మన సామీప్యం ఆధారపడి ఉన్నాయి.

JUN 2012.indd 2 6/4/12 11:55 AM

షేఖ్ అబ్దుల్ హఖ్
(పొరుమామిళ్ళ)

దైవాజ్ఞ అన్నింటికంటే విలువైనది



మానవులు భయపడవలసింది దైవానికే. ఆయన తిరుగు లేని వాడు. గొప్ప క్షమాశీలి. క్షమించే అధికారం ఆయనకు మాత్రమే ఉంది. కాబట్టి మనం ఆయనకు మాత్రమే విధేయత చూపాలి. ఆయన్ని ఎదిరించకూడదు. ఆయన ఆజ్ఞలన్నింటికి శిరసా వహించాలి. ఆయన వారించిన వాటిని విడనాడాలి. అప్పుడే మానవులు ఆయన మన్నింపుకు, కనికరానికి నోచుకుంటారు.

పూర్వకాలంలో ఒక పరాక్రమవంతుడయిన రాజు ఉండేవాడు. అతని పేరు **'మహ్మూద్ గజ్నవీ'.** అతని వద్ద ఒక విశ్వాస పాత్రుడయిన బానిసుండేవాడు. అతని పేరు **'అయాజ్'.** రాజు అతడ్ని ఎంతగానో అభిమానించేవాడు. మంత్రీసాంతులు, అధికారుల కంటే కూడా ఎక్కువ ఆప్యాయతను కనబర్చేవాడు. ఒకసారి అతని అభిమానాన్ని అందరి ఎదుట పరీక్షించదలిచాడు ఆ పాదుషా.

ఒకానొక సందర్భాన రాజుకు ఎవరో ఒక విలువైన వజ్రాన్ని బహూకరించారు. అది ఎంతో సుందరమైనది, అత్యంత విలువైనది. ఎంతో ప్రకాశమానమయినదీను. రాజ దర్బారులో సమావేశం రాజు అధ్యక్షతన ప్రారంభమయింది. ఆ నిండు సభలో ఆ వజ్రపు ప్రాశస్త్యం అందరి చేత వర్ణించబడింది. అలాంటి వజ్రాన్ని తామెన్నడూ చూడలేదన్నారు కొందరు. ఆ రాజు ప్రధానమత్రిని ఆ వజ్రం ఎలా ఉందన్నాడు. ఈ ప్రపంచంలోనే అలాంటి వజ్రం లేదన్నాడు. బాదుషా ఆ వజ్రాన్ని ఆయన చేతికిచ్చి **'దీన్ని నెలకేసి కొట్టి ముక్కలు చయండి'** అన్నాడు.

'జహాఁపనా! ఇది తమరి వద్ద గుర్తుగా ఉంచుకోవలసిన కానుక. దీన్ని ముక్కలుగా చేయలేను. క్షమించండి!' అని సవినయంగా చేతులు కట్టుకొని నిలబడ్డాడు ప్రధానమంత్రి.

'మంచిది కూర్చోండి'.

ఆ తర్వాత మరో మంత్రిని పిలిపించాడు. అతనూ అదే మాట అన్నాడు. ఇలా ఎవరూ దాన్ని ముక్కలు చేయడానికి సాహసించి ముందుకు రాలేకపోయారు. చివరకు రాజు 'అయాజ్'ను పిలిచాడు.**'ఈ వజ్రాన్ని నేలకేసి కొట్టి ముక్కలుముక్కలుగా చెయ్యి'** మని ఆజ్ఞాపించాడు. అయాజ్ రాజాజ్ఞకు శిరసావహించి ముక్కలు ముక్కలు చేశాడు ఆ వజ్రాన్ని.

'ఈ వజ్రాన్ని ఎందుకు ముక్కలు చేశావు? ఇక్కడున్నవాళ్ళు పిచ్చోళ్ళా? నీవు మాత్రమే ఆ పని ఎందుకు చేసావు?' అని పాదుషా గద్దించి అడిగాడు. అందుకు అయాజ్ –'జహాఁపనా! తప్పయి పోయంది. ఇది చాలా విలువయినదే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. అది విరిగి ముక్కలయితే ఎక్కువ నష్టమే జరుగుతుందనీ నాకు తెలుసు. అయితే ఈ విలువైన వజ్రం కంటే తమరి ఆజ్ఞ నా దృష్టలో అమూల్యమైనది. ఈ వజ్రం ముక్కలయితే మరో వజ్రాన్ని తెచ్చుకోవచ్చు. కాని తమ ఉత్తర్వుకు ఎట్టి స్థితిలోనూ భంగం వాటిల్లకూడదు. వజ్రంకంటే ఎన్నో రెట్లు విలువయినది తమరి ఆజ్ఞ. కాబట్టి ఈ వజ్రం కోసం మీ ఆజ్ఞ భంగపడటం నాకిష్టం లేదు. అందుకే అలా చేశాను' అన్నాడు అయాజ్.

ఈ సంఘటన తర్వాత రాజ్య సభలో –

'మీకూ అయాజ్‌కూ మధ్య ఉన్న తేడా ఇదే. మీరు ఆదేశం జారి అయ్యాక కూడా ఆలోచిస్తారు. అయాజ్ విన్నదే ఆలస్యం శిరసా వహిస్తాడు' అని అయాజ్ అభిమానాన్ని మెచ్చుకున్నాడు పాదుషా.

అచ్చం ఇలాగే మనము సయితం ఈ ప్రపంచాన్ని సృష్టించిన అల్లాహ్ ఆజ్ఞను ఆవశ్యం ఆచరించాలి. మనిషి మానానికి, తనానికి, ధనానికి భంగం వాటిల్లవచ్చు. భవిష్యత్తు గురించి కన్న కలలన్నీ కల్లలయిపోవచ్చు, చాలా ఆప్తులయివారే దూరమై పోవచ్చు, ప్రాణాధికంగా ప్రేమించే పిల్లలు మృత్యు వాతన పడవచ్చు, విరహాగ్నిలో మనిషి నిలువునా దహించుకు పోవచ్చు. ఏదైనా జరగవచ్చు, ఏమైనా కావచ్చు. కానీ; అల్లాహ్ ఆజ్ఞకు భంగం వాటిల్లకూడదు. దైవాదేశం అందాక కూడా అతి తెలివిని ఉపయోగించి దాని లోతుపాతుల్ని తరచి చూడాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. ఆజ్ఞాపాలన చేయకుండా కాలయాపన చేస్తూ ఆలస్యం చేసే వ్యక్తిని ఏ యజమాని ఇష్ట పడడు. కాబట్టి సృష్టి మొత్తంలో అన్నింటికంటే విలువయినది దైవాజ్ఞ అన్న నిజాన్ని గుర్తెరిగి నడచుకోవాలి. ఆయన ఆజ్ఞలను ఏ సందేహం, సంశయం లేకుండా వెంటనే ఆచరించాలి. నిజమయిన దైవ దాసుల లక్షణం కూడా ఇదే.

"మా ప్రభూ! పిలిచేవాడొకడు విశ్వాసం వైపు పిలవటం, **'ప్రజలారా మీ ప్రభువు వైపునకు మరలండి'** అని మేము విన్నాము. అంతే! మేము విశ్వసించాము. **కనుక ఓ ప్రభూ! మా పాపాలను మన్నించు.మా చెడులను మా నుండి దూరం చెయ్యి. సజ్జనులతో పాటు మాకు మరణం వొసగు. మాప్రభూ! నీ ప్రవక్తల ద్వారా నీవు మాకు చేసిన వాగ్దానం ప్రకారం మమ్మల్ని అనుగ్రహించు. ప్రళయ దినాన మమ్మల్ని అవమానపరచకు. ఎట్టి పరి స్థితిలోనూ నువ్వు వాగ్దానానికి విరుద్ధంగా వ్యవహరించేవాడవు కాదు".**

(దివ్య ఖుర్‌ఆన్–4: 193, 194)

JUN 2012.indd 3 6/4/12 11:55 AM

ఆహారపానీయాలు - ఆచార నియమాలు



శాఖాహారమనేది ప్రస్తుతం ప్రపంచమంతటా ఒక ఉద్యమ రూపం సంచరించుకున్నది. అనేకులయితే దీన్ని, జంతువుల హక్కులతో జోడిస్తున్నారు. ప్రజల్లోని ఒక పెద్ద సంఖ్య మాంసాహారులనే విషయంలో సందేహం లేదు. అంతేకాక, మిగిలినవారు అంటే శాఖాహారులు, ఈ మాంసాహారాన్ని జంతువుల హక్కుల్ని హరించే చర్యగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ మతాలలో ఆహారపానీయాల విషయంలో చోటు చేసుకున్న ఆచారనియమాలను చూసి **'అన్ని మతాల సారాంశం ఒక్కటే, అందరి దేవుడు ఒక్కడే'** అయినప్పుడు ఆహార నియమాలు కూడా ఒక్కటే ఎందుకు కాకూడదు? ఎందుకు లేవు? అన్న సంశయం ఎవరికయినా కలుగుతుంది. దానికి సంబంధించిన సమాచారాన్ని క్లుప్తంగానయినా సరే తెలియజేయాలన్నది ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం. పాఠక మహాశయులు అర్థంచేసుకుంటారని ఆశిస్తూ.....

- శాంతిప్రియ

'అల్లాహ్ తన దాసుల కొరకు పుట్టించిన అలంకరణను ఎవరు హరామ్ చేశారో? ఎవరు దైవ ప్రసాదించిన పరిశుద్ధ పదార్థాలను నిషేధించారో? (ప్రవక్తా!) వీరిని అడుగు'. (ఆరాఫ్: 32)

ప్రపంచంలోని సకల అలంకరణలను, పరిశుద్ధ వస్తువులను దేవుడు తన దాసులయిన మానవుల కొరకే పుట్టించాడు. అలాంటప్పుడు వాటిని తన దాసులకు నిషేధించడం అన్నది మటుకు ఎట్టి స్థితిలోనూ దైవేచ్ఛ కాజాలదు. ఇక ఏదయినా సామాజిక వ్యవస్థ, ఏదయినా మతం, ఏదయినా నైతిక నియమా వళి, వీటిని నిషిద్ధాలుగా, లేదా ఏహ్యమయినవిగా, లేదా ఆధ్యాత్మిక వికాసంలో ప్రతిబంధకాలుగా పరిగణిస్తే, అది దైవ దత్తమయినది కాజాలదని, అది ముమ్మాటికి ఆయా వ్యక్తుల, సమాజాల **'చపలచిత్త శాసనం'** మాత్రమే కాగలదని దాని ఈ చర్య స్వయంగా రుజువు చేస్తుంది. ఇలా మనిషి ఎందుకు చేస్తాడు అంటే, ప్రపంచంలో నివ సించేవారు అనేకమంది జ్ఞానానికి బదులు ఊహలు, అనుమానాలను అనుకరిస్తారు. వీరి విశ్వాసాలు, అభి ప్రాయాలు, తత్వాలు, జీవన సూత్రాలు, ఆచార నియమాలు అన్నీ ఊహాజనితమయి నవిగానే రూపొందు తాయి.

అలా భూ వాసులు తమ స్వంత ఊహల, భ్రమల ఆధారంగా ఏర్పరచుకున్న తప్పుడు విధానాలు అనేకం మత సంబంధమయిన నియన నిబంధల స్థానం పొందాయి. అలాంటివాటిలో వివిధ జాతులు, వర్గాలు పాటించే భోజనపానీయాలకు సంబంధించిన ఆంక్షలు కూడా ఉన్నాయి. ఆ వివరాల్ని ఇప్పుడు మనం తెలుసుకుందాం.

హిందూయిజం


హిందూ మతంలో ఎంత వైవిధ్యం ఉందో అన్ని రకాల ఆహార నియమాలున్నాయి. భౌగోళిక పరిస్థితులు, స్థాయి భేదాలు, వర్ణ, కుల, గోత్ర, అంతస్తుల వ్యత్యాల వల్ల హిందువుల ఆహార వ్యవహారాలలో తేడాలున్నట్లు మనం గమనించవచ్చు. భారత దేశంలోనే ఉత్తరాది దక్షిణాది ఆహార పద్ధతుల్లో ఎంతో తేడా ఉంది. దక్షిణాది భోజనం అనగానే ఎవ్వరికయినా అరిటాకులో అన్నం, కూరలు, గొంగూర, ఆవకాయ పచ్చళ్ళూ గుర్తుకొస్తాయి. రసం, సాంబారు నోరూరుస్తాయి. తప్పనిసరిగా ఉండే అన్నం చివర్న జీర్ణ వ్యవస్థని దారిలో పెట్టే పెరుగూ, ఒకటి అరా స్వీట్లు-ఇవి లేకుండా దక్షిణ భోజనమే ఉండదు. ఉత్తరాది భోజనాల్లో దీనికి భిన్నంగా గోధుమ రొట్టె ఉంటుంది.

'జంతువుల మాంసం తినడం అంటే మన పిలల్ల మాంసాన్ని మనమే తినడంలాంటి నీచమైన చర్య' అని మహా భారతంలో భీష్ముడు యుధిష్టిరుడితో చెప్పాడు అని ఉన్నా, **'మాంసం'లో మమ్ అంటే నేను, స అంటే అతను** అని అర్థాలు తీసినా, **మాంస భక్షణ ఆధ్యాత్మిక జీవితానికే కాదు, ఆరోగ్యానికీ, పరిసరాలకు కూడా హానికరమని కొందరు భావించినా** మాంసాహారం విషయంలో వేద వ్యాఖ్యానాల్లో కొన్ని వైరుధ్యాలున్న మాట నిజం. తొలి వేదంగా భావించబడే ఋగ్వేదంలో మాంసాహారం ప్రస్తావన ఉంది. యజ్ఞవాటికల వద్ద మాంసభక్షణని ఋగ్వేదం సమర్థిస్తున్నట్లుగా ఆధారాలూ ఉన్నాయి. దాదాపు 6 సంవత్సరాల క్రితం వేదాచార్య వామదేవ శాస్త్రి **'హిందూ సాంప్రదాయంలో మాంసం, గోమాంస భక్షణ'** అన్న శీర్షికతో ఒక పుస్తకం రాశారు. అందులో ఆయన పశువు వధ యజ్ఞయాగాదుల్లో ప్రధానంగా ఉండేదని చెప్పడానికి అనేక ఆధారాలు చూపించారు. **'పశుబంధు'** అనే పేరిట జంతువు బలి సర్వ సాధారణంగా జరిగేదని పేర్కొన్నారు. ఇది వాస్తవంగా జరిగేది అని చెప్పడానికి ఆయన వేదాల నుంచే అనేక ఆధారాలు చూపించారు కూడా.

JUN 2012.indd 4 6/4/12 11:56 AM

ఏదయినా సామాజిక వ్యవస్థ, ఏదయినా మతం, ఏదయినా నైతిక నియమావళి, వీటిని నిషిద్ధాలుగా, లేదా ఏహ్యమయినవిగా, లేదా ఆధ్యాత్మిక వికాసంలో ప్రతిబంధకాలుగా పరిగణిస్తే, అది దైవదత్తమయినది కాజాలదని, అది ముమ్మాటికి ఆయా వ్యక్తుల, సమాజాల **'చపలచిత్త శాసనం'** మాత్రమే కాగలదని దాని ఈ చర్య స్వయంగా రుజువు చేస్తుంది.

ఉదాహరణకు హిందూ మతానికి చెందిన ప్రఖ్యాత శాసన గ్రంథం 'మనుస్మృతి'లోని కొన్ని ఆధారాలు –



"తినడానికి ఉపయుక్తమయిన వాటి మాంసాన్ని తినేవాడు, ఎలాంటి తప్పు చేయడం లేదు. ఇలా వారు ప్రతినిత్యం చేస్తున్నా సరే, ఎందుకంటే కొన్ని తినబడటానికి, మరికొన్ని తినడానికి దైవం స్వయంగానే అలా సృష్టించాడు".
(మనుస్మృతి–5: 30)

"మంత్రాల ద్వారా పవిత్రం చేయబడిన మాంసాన్ని భుజించాలి. బ్రహ్మణులకెప్పుడయినా మాంసం తినాలని కోరిక కలిగితే, వారు యజ్ఞంలో నియమాల్ని అనుసరించి పవిత్రం చేసి తినాలి".
(మనుస్మృతి–5: 27,28)

అలాగే మహా భారతం అనుశాసన పర్వంలోని 58వ అధ్యాయంలో, ఎవరైనా ఒక వ్యక్తి తన తాత, ముత్తాతల ఆత్మలకు శ్రాద్ధ సందర్భంలో, ఆత్మల తృప్తి కోసం ఏదయినా ఆహారాన్ని సమర్పించదలచిన సమయంలో ఏం చేయాలి అనే విషయంలో ధర్మరాజు యుధిష్టరునికి మరియు భీష్మ పితామహునికి మధ్య జరిగిన సంభాషణలో అనేక జంతువుల ప్రస్తావనతోపాటు **...'గో మాంసం ద్వారా ఆ ఆత్మలు ఒక సంవత్సరం వరకు సంతృప్తంగా, సంతోషంగా ఉండగలుగుతాయి'** అని ఉంది.

అంటే హిందూ మత గ్రంథాల్లో, మాంసాహారానికి అనుమతి ఉన్నప్పటకీ, హిందూ మతావలంబీకులు కొందరు తర్వాత ఇతర మతాల (బౌద్ధ మతం, ముఖ్యంగా జైన మతం) ప్రభావంతో తమ కోసం శాఖాహార వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు.

'మాంసాహా రాన్ని, ముఖ్యంగా ఆవు మాంసాన్ని వ్యవసాయ వ్యవస్థకు లోబడి నిషేధించుకున్నారు' అన్నది అనేక చరిత్రకారుల మాట. ఒకప్పుడు పాక్షికంగా ప్రారంభమయిన ఆ ఆచారమే నేడు అత్యంత ప్రధానమయినది మారి, అనేక రాష్ట్రాల్లో గోవధపై నిషేధం కొనసాగుతోంది. ఇంకా **'పంచ గవయ్యా'** – ఆవు నుంచి లభించే పాలు, పెరుగు, నెయ్యి, మూత్రం, పేడ–(ప్రస్తుతం కొన్ని మార్పు చేర్పులతో) పంచామృతంగా భావించే వారు సయితం అధిక సంఖ్యలోనే కన బడతారు. అదే విధంగా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో, పండగల్లో కొన్ని రకాలకూర గాయలు తినడం నిషేధం అన్న ఆచారం తోపాటు కొన్ని కూరగాయలను ఇతర కూరగాయలతో కలిసి తినకూడదు అన్న మాట కూడా బలంగా వినబడుతోంది. అంటే హిందువులందరికీ ఒకే విధమైనటు వంటి ఆహార నియమాల వ్యవస్థ లేదని తెలుస్తోంది.



దక్షిణాది భోజనం అనగానే ఎవ్వరికయినా అరిటాకులో అన్నం, కూరలు, గొంగూర, ఆవకాయ పచ్చళ్ళూ గుర్తుకొస్తాయి. రసం, సాంబారు సోరూరుస్తాయి. తప్పనిసరిగా ఉండే అన్నం చివర్న జీర్ణ వ్యవస్థని దారిలో పెట్టే పెరుగూ, ఒకటి అరా స్వీట్లు-ఇవి లేకుండా దక్షిణ భోజనమే ఉండదు.

బౌద్ధ మతం:

మూడు పరిస్థితుల్లో మాంసాహారం ముట్ట రాదని గౌతమ బుద్ధుడు చెప్పాడు అని అంటారు. అయితే సర్వకాల, సర్వ వ్యవస్థ లోనూ బౌద్ధులు ఒకే విధమైన ఆహార నియమాలకు కట్టుబడి లేరు. దలైలామా కూడా శాకాహారి కాదు. చివరికి బుద్ధుడు కూడా మాంసాహారేనని వాదించే బౌద్ధులూఉన్నారు. బుద్ధుడి మరణం గురించి రెండు రకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఒకటి: కుళ్ళిన పంది మాంసం తినడం వల్ల చనిపోయాడని, రెండు: విషపూరితమైన పుట్టగొడుగు తినడం వల్ల అని. ఆ విషయాని కొస్తే శాకాహారం గురించి ఇతరులు చెప్పినంత స్పష్టంగా బుద్ధుడు ఎక్కడా చెప్పలేదు. తన భిక్షపాత్రలోకి ఏ విధమయినటువంటి ఆహారం వచ్చినా – అది మాంసాహారం అయినప్పటికీ గొప్ప కృతజ్ఞతా భావంతో దాన్ని స్వీకరించాల్సిందేనని బుద్ధుడు చెప్పాడు.

ఈ నాడు రెండు ప్రధాన బౌద్ధ సంప్రదాయాలున్నాయి. ఒకటి హీనయానం, మరొకటి మహాయానం.

హీనయానం – ఆత్మ చైతన్యం ద్వారా ఆధ్యాత్మిక విముక్తి సాధించవచ్చని చెబుతోంది.

పరోపకారం ద్వారా, సేవ ద్వారా ఆధ్యాత్మిక విముక్తి సాధించవచ్చనే కౌటుంబిక వాదం **మహాయానం.**

కొసమెరుపు ఏమిటంటే సామాన్య బౌద్ధ ప్రజలకు, భిక్షువులకు ఆహార నియమాలు జీవన నియమ నిష్ఠలు వేర్వేరుగా ఉంటాయన్నది. బుద్ధుడి జీవిత కాలంలో జంతు బలులు, మాంస భక్షణ సర్వసాధారణంగా జరిగేవి అన్నది నిర్వివాదాంశం. ఆయన సయితం అనేక సందర్భాల్లో మాంసం భుజించినట్లు ఆధారాలున్నాయి గనక ఆయన నిషేధించింది మాంసాహారాన్ని కాదు, మాంసం కోసం జంతువుల్ని వధించే క్రూర (యజ్ఞంలో సజీవ పశువుని నిలబెట్టి నెయ్యి పోస్తూ కాల్చడం లాంటి) పద్ధతిని ఆయన నిరసించాడు అని తెలుస్తుంది.

(మిగతాది వచ్చే సంచికలో)

JUN 2012.indd 5 6/4/12 11:56 AM



షేక్ యజ్దానీ

కువైట్ ఆకర్షణా కేంద్రాలు

హరిత దీవి《Green Island》



హరిత దీవిలో ప్రవేశించగానే మీరు ఏడారి ప్రదేశంలో నివసిస్తున్నామన్న విషయాన్నే మరచిపోతారు. ఈ దీవి నలుదిక్కులా పచ్చని చెట్లు, చిన్ని పొదలు, వివిధ రకమైటువంటి మొక్కలతో నిండి ఉంది. దీనికి తోడుగా సందర్శకుల కాలక్షేపం కొరకు 700 మంది కూర్చోని వీక్షించగలిగే ప్రదర్శనశాల ఉంది. ఇందులో నాటకాలు, సాంస్కృతిక కార్య క్రమాలు ప్రదర్శించబడుతుంటాయి. రెస్టారెంట్ల తోపాటు, ఈత కొలనులు, పిల్లల కొసం క్రీడా వసతులు, అందమైన జల పాతాలు కూడా ఉన్నాయి. ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం లో కాలం గడపడం ఎంతో ఉత్సాహానిస్తోంది.

స్థలము: సముద్ర తీరం, షువైఖ్ నుండి రాస్ అల్ అర్ద్ తీరప్రాంతం.

సంప్రదించుటకు: 22526153

మంచు స్కేటింగ్ క్రీడాశాల《Ice Skating Rink》



1980 సంవత్సరం మార్చి నెలలో ఏర్పాటు చేయబడినది. గల్ఫ్ ప్రాంతంలో మొదటిది మరియు దాదాపు 8398 చదరపు మీటర్ల వైశాల్యము కలిగి కువైట్ పట్టణంలో ఏర్పాటు చేయబడినది. ఇందులో రెండు స్కేటింగ్ క్రీడాశాలలు గలవు. 1) ఒలంపిక్ క్రీడాశాల. దాదాపు 1800 చదరపు మీటర్ల మంచు ఉపరితలము కలిగి, 1800 మంది ప్రేక్షకుల వసతి కలిగి, పాదరక్షలు మార్చు గది, పరికరాల గది మొదలైన వసతులు కలిగి ఉన్నది. రెండవ క్రీడాశాల – 600 ప్రేక్షకుల వసతితోపాటు పై వసతులన్నీ కలిగి ఉన్నది. ఇక్కడ వివిధ రకమైన రెస్టారెంట్లు కలవు. 1981లో కువైట్ ఫల్కాన్《Kuwait Falcon》 పేరుతో మొదటి జాతీయ మంచు హాకీ జట్టు ఏర్పాటు చేయడమైనది. ఇక్కడ తరచు విదేశి జట్టులతో స్కేటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ప్రతి ఆదివారం ప్రభుత్వ ఉద్యోగులకు, సంస్థలకు ప్రత్యేకమైన డిస్కౌంటు ఉంటుంది.

సంప్రదించుటకు: 2241151, 2241152

అల్ ఖిరాన్ విశ్రాంతి ప్రదేశము《Al Khiran Resort》




అల్ ఖిరాన్ విశ్రాతాలయము కువైట్ నుంచి 120 కి.మీ దూరములోసౌదీ అరేబియా రహదారిలో అల్ ఖైరాన్ మంతఖాలో ఉన్నది. ఇక్కడ 196 విశ్రాంతి గృహాలున్నవి. ఇందు లో అన్ని వసతులు, సౌకర్యాలతో రెస్టారెంట్లు ఏర్పాటు చేయబడినవి. ఈ తీర ప్రాతంలోని శుభ్రమయిన, స్వచ్ఛమయిన ఇసుక సందర్శ కులను జలక్రీడలకు స్వాగతం పలుకుతున్న ట్లుగా ఉంటుంది.ఇక్కడ మంచి నీటి మరియు ఉప్ప నీటి ఈత కొలనుల ఏర్పాటు కలదు.

అలాగే ఫుట్‌బాల్, వాలి బాల్, టెన్నిస్ బాస్కెట్ బాల్ క్రీడా సౌకర్యం కలదు. ఇక్కడ《Yatca Club》 పడవల క్లబ్ ఏర్పాటు కూడా ఉంది. ఇందులో సభ్యత్వము ద్వారా పడవ అభ్యాసన చేయ వచ్చు. పిల్లలు ఆడుకోవడానికి, వివిధ రకాల క్రీడలు, కంప్యూటర్ గేమ్సు మరియు వీడియో గేమ్స్ గదులు ఏర్పాటు చేయబడి ఉన్నవి. అలాగే సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుకు ఒక విశాలమైన టెంటు ఏర్పాటు కూడా ఉంది.

సంప్రదించుటకు: 23951122

కువైట్ బురుజులు《Kuwait Towers》



కువైట్ బురుజులపై నుండి కనబడే కువైట్ సుమనోహర దృశ్యాన్ని ఒక్క సారి చూస్తే ఎప్పటికీ మరచిపొలేరు. 1980లో కువైట్ బురుజులు ప్రతిష్టాత్మకమైన ఆగా ఖాన్ అవార్డు సొంతం చేసుకున్నాయి. ఈ అవార్డు ఆర్కిటెక్చరల్ విశిష్టతకు గుర్తింపు గా ఇవ్వబడుతుంది.

ఈ బురుజు పై భాగము 360 డిగ్రీలతో నాలుగు దిక్కులా గుడ్రంగా తిరుగుతూ ఉంటుంది. దీని పైభాగంలో రెస్టారెంటు కూడా కలదు. ఈ బురుజులలో మిలియన్ గ్యాలన్ల నీటిని నిల్వ చేసే ట్యాబ్‌లు కూడా ఉన్నాయి.

స్థలము: అరేబియన్ గల్ఫ్ తీరప్రాంతము. షర్క్. **సంప్రదించుటకు:** 22444021, 22444038

JUN 2012.indd 6 6/4/12 11:56 AM

కువైట్ జంతు ప్రదర్శన శాల
《Kuwait Zoo》



జంతుప్రదర్శనశాల ఎర్పాటు చేసినప్పటి నుంచి కువైట్‌లో ముఖ్యమైన కాలక్షేప కేంద్రంగా అలరారుతున్నది. ఇక్కడి జంతువులు ప్రపంచంలోని వివిధ దేశాల నుండి తేబడ్డాయి. కువైట్‌లో ఉన్న వారు ఒక్కసారైనా దీన్ని సందర్శించడం గొప్ప అనుభూతినిస్తుంది.
స్థలము: ఉమైరియా ప్రాంతము, ఎయిర్‌పోర్ట్ రహదారి.
సంప్రదించుటకు: 24733389
సందర్శించు వేళలు– **వేసవిలో:** 8 A.M నుండి రాత్రి 12 A.M వరకు.
శీతాకాలంలో: 8 A.M నుండి 8 p.Mవరకు


మసీలా సముద్ర తీరము
《Al Messila Beach》



మసీలా బీచ్ కువైట్‌లోని అతి పెద్ద సముద్ర థిరము. ఇది షహాహీల్ రహదారి నుంచి 350 మీటర్ల దూరములో ఉన్నది. ఇక్కడ తెల్లటి ఇసుక మరియు స్వచ్ఛమయిన నీలి రంగు సందర్శకుల మనస్సును ఉత్తేజ పరుస్తుంది. ఇక్కడ అన్ని వయసులవారికి నీటి కొలనుల వసతి కలదు.
సంప్రదించుటకు: 25650642

సంగీత ఫౌంటెన్
《Musical Fountain》

ఈ సంగీత ఫౌంటెన్ ఒక ఉద్యాన వనము. ఇది 220 ఫౌంటెన్లతో మూడు అంతస్థులలో వ్యాపించి ఉంది. ఈ ఫౌంటెన్ ప్రపంచంలోనే పెద్ద ఫౌంటెన్లలో 4వ స్థానం గలది. ముఖ్యంగా వేసవి కాలంలో రాత్రి వేళలో ఇక్కడి దృశ్యాలు, నీటి ధ్వనులు, కాంతులు ఎంతో ఆహ్లాదాన్నిస్తాయి.
పని చేయు వేళలు శనివారం మినహా:
వేసవిలో – 4 p.M నుండి 12 A.M వరకు
శీతాకాలంలో – 3 p.M నుండి 10:30 p.M వరకు
సంప్రదించుటకు: 22428394



నేషనల్ మ్యూజియం
《Natinal Museum》

ఈ మ్యూజియంను సందర్శించినప్పుడు మీరు ఎన్నో వందల ఏళ్ళ పురాతన వస్తువులు, పరికరాలు, ఇస్లామిక్ సాంస్కృతిక నిదర్శనాలు, వివిధ రకాల వస్తువులను వీక్షించగలరు. ఈ మ్యూజియంలో ప్రదర్శించ బడే వస్తువులు కువైట్ మరియు అరబ్ ప్రపంచపు ప్రాచీన సంస్కృతీనాగరికతలకు నిలువెత్తు నిదర్శనాలు.
స్థలం: అరేబియన్ గల్ఫ్ స్ట్రీట్, సీఫ్ ప్యాలెస్ మరియు పార్లమెంటు మధ్య.
సంప్రదించుటకు:22451195, 22456534



రాస్ అల్ అర్ద్ క్లబ్
《Ras Al Ardh Club》



ఈ క్లబ్ రాస్ సాల్మియా ప్రాంతంలో 19,025 చదరపు మీటర్ల వైశాల్యములో ఏర్పాటు చేయబడినది. ఇక్కడ సభ్యులు వివిధ రకాల క్రీడలు, కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు. ఇక్కడ బాస్కట్ బాల్, వాలీ బాల్, టెన్నిస్ క్రీడల మైదానాలు కలవు. మరియు టెన్నిస్, టేబుల్ టెన్నిస్ వసతితోపాటు రెండు ఈత కొలనులు, డైవింగ్ పూల్, పిల్లల కొరకు ప్రత్యేక పార్కు ఏర్పాటు చేయబడి ఉన్నవి.

సాధు గృహము
《Sadhu House》



సాధు అనేది పురాతన పారంపరగతమైన చేనేత కళ. ఇక్కడ చేనేత మగ్గాల ద్వారా రంగు రంగుల కార్పెట్లు, రగ్గులు, టెంట్ తెరలు మొదలగునవి తయారు చేయబడును. ఇక్కడ సందర్శకులు, స్త్రీ చేనేత కళా నిపుణుల్ని పనులు చేస్తుండగా చూడగలరు. ఈ సాధు గృహము కువైట్ పురాతన చేనేత కళల సంరక్షణా కేంద్రము.
స్థలము: జాతీయ సంగ్రహాలయము ప్రక్కన
సందర్శించు వేళలు – 8 A.M నుండి 1 p.M వరకు, 5 p.Mనుండి 7 p.M వరకు.
సంప్రదించుటకు: 22432395

JUN 2012.indd 7 6/4/12 11:56 AM

బుష్రా ఫాతిమా

ఏది వాత్సల్యం? ఏది మాత్సర్యం?

వాత్సల్యం - మాత్సర్యం



'సంతాన సంపూర్ణ హితాన్ని కోరేది వాత్సల్యమయితే, సంతాన వినాశనానికి ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానయినా కారణమవ్వడం మాత్సర్యం'. తలమాపి మాయయని స్థితి నుండి మానవత్వానికే తలమానికం అయ్యేలా తనయుల్ని తీర్చిద్దిద్దాల్సిన భాధ్యత తల్లిదండ్రులదే. పిలల్ల **'తల'**తో **తల** పెట్టిన మాటలు తేనెల తేటలయి వారు ఆనందంగా ఆశ్వాదించేవిగా ఉండాలి. అతకని అబద్దాలు, పొంతన లేని విషయాలు, అర్థం లేని పంకలు, **తల**తోక లేని కథలు, కాకమ్మ కబుర్లు, పుక్కిటి పురాణాలు పిల్లలకు చెప్ప కూడదు. కలకన్నా వాస్తవంలో ఉన్న అనుభూతికి అనుభవాన్ని జోడించి చెప్పాలి. పిల్లల్ని బూచోడొస్తున్నాడనో, పిచ్చి పుల్లమ్మ వస్తున్నదనో లేని భయాలను కలిగించకూడదు. **'బాల్యంలో చోటు చేసుకునే భయాలు, చేదు అనుభవాలు వారిని పెద్దయ్యాక కూడా వెంటాడుతుంటాయి. కొందరు జీవితంలో సఫలం కాలేకపోవడానికి గల కారణాల్లో ముఖ్య కారణం బాల్యం తాలూకు భయాలే'** అన్నది. మానసిక శాస్త్రవేత్తల మాట. తల్లిదండ్రులు తనయులకు చెప్పింది **తల**కెక్కాలి. మనం చెప్పింది తలకెక్కించుకోవడం, ఎక్కించుకోకపోవడం వారి సమర్థతో, అసమర్థతో అయివుండొచ్చు. కానీ, తలకెక్కేలా చెప్పడం, చెప్పకపోడం మాత్రం ఖచ్చితంగా మన సమర్థత, అసమర్థ మీదే ఆధారపడి ఉంటుందన్న విషయాన్ని మరువ కూడదు. చదువులో, సంస్కారంలో అందరిని **తలదాటిన** వారిగా వారిని తీర్చిదిద్దాలి. అనవసరమయిన విషయాలలో, **తలదూర్చితే** లేని పోని చిక్కుల్లో పడే ప్రమాదముంటుందని తెలిసి వచ్చేలా, తెలివి వచ్చేలా చెప్పాలి. తల్లి దండ్రుల ఆజ్ఞలకు **తలదాల్చే**వారిలా వారిని మలచాలి. విదేశాల్లో రెక్కలు ముక్కలు చేసుకొని కన్నపిల్లల కోసం కష్టపడుతున్న కన్నవారు వారి గొంతెమ్మ కోర్కెల్ని తీర్చడమే కాక, సమయం కేటాయించి కనీసం నెలకోసారయినా వారితో ప్రశాంతంగా మాట్లాడాలి.

వారి చదువుకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. ఇళ్ళల్లో ఉన్న తల్లులు అన్ని వేళలా రుచికరమయిన వంటకాలు మాత్రమే వడ్డించకుండా అప్పుడప్పుడు పచ్చడి అన్నాన్ని, సద్దన్నాన్ని కూడా తినిపించాలి. అలా తినిపించినప్పుడు అలా ఎందుకు తినిపిస్తున్నారో, తల్లిగా దాని వెనుక లక్ష్యం ఏమిటో వారికి అర్థమయ్యేలా ప్రేమగా చెప్పాలి. లేదంటే పిల్లలు తల్లిని అపార్థం చేసుకునే ప్రమాదముంటుంది. మనం పిల్లలకు కేవలం మన ఆస్తుల్ని, ఐశ్వర్యాల్ని, సౌఖ్యాల్ని, సౌకర్యాల్ని మాత్రమే కాదు ఇవ్వాల్సింది, మన కష్టాలు, మన బాధలు సయితం వారికి అర్థమయ్యేలా ప్రణాళికబద్ధంగా ప్రయత్నించాలి.

ఒక విషయం గురించి పూర్తిగా తెలియటాన్ని **'పాండిత్యము'** అంటారు. సమయానుకూలంగా ప్రవర్తించడాన్ని **'సమయస్ఫూర్తి'** అంటారు. పరిష్కారాన్ని ఆలోచించగలిగే శక్తిని **'ప్రజ్ఞత'** అంటారు. ఇవన్నీ కలిస్తే వచ్చేది **'జ్ఞానం'** అని అలాంటి జ్ఞానం లేని చదువు ఫల శూన్యం' అన్నది వారిని బోధ పర్చాలి. అట్టి జ్ఞానంతోనే ధ్యానం సాధ్యం అని, ఎలాంటి స్థితులు ఎదురయినా అదరని చెదరని **'స్థితప్రజ్ఞ**'కు మూల సాధనం అని వారికి ఎరుక పర్చాలి. అలాకాక మమకారానికి పోయి **తల**కెత్తుకుంటే తనయులయినవారే **తల**కు మించిన భారమయి కూర్చుంటారు. తర్వాత తల్లిదండ్రులు క్షోభతో, బాధతో తల్లడిల్లిపోవాల్సి వస్తుంది. అట్టి గుణ శూన్యులు కామమధికమయి కన్ను కాగన కన్నెనే సర్వస్వంగా భ్రమించి, కన్నవారిపై కన్నెర్ర జేసి, మిన్ను గానక, మమతానురాలను మరచి, ఒళ్ళూ పైనా తెలియక ఒయ్యారాలు ఒలక బోసే ఒయ్యారి భామల కొరకు కన్నవారినే కాలదన్ని **'పుట్టి తల్లికి గండము, పెరికి ఊరికి గండము'**గా మారి, చివరకు ఉన్నవన్నీ ఊడ్చు కుపోయి, అస్తవ్యస్థ దురవస్థ దాపురించి, బ్రతుకు తలక్రిందులయి, తల దాచుకునేందు కు చోటు దొరకక దరిద్రపు చావు చస్తారు అన్న విషయాన్ని మరువ కూడదు. అప్పుడు వారి కోసం ఏ ఆకాశము రోధించదు, ఏ అవనీ విలపించదు.

వాత్సల్యం-సంస్కారం




నేటి మన పాఠశాలల చదువులయితే అటు వంటి జ్ఞానాన్ని, సామాజిక స్పృహని కలుగజేయడం లేదు. పిల్లలకు ఈ స్కూళ్ళు, కాలేజీలు నేర్పే చదువు తప్ప సంస్కారం, నిజమయిన భక్తి, గౌరవం వంటి ఇతర విషయాలు తెలియకుండా చేసే తల్లిదండ్రుల సంఖ్య రోజురోజుకి పెరిగిపోతున్న మన సమాజంలో వినయ పాత్ర తగ్గి విర్రవీగే తత్వం ప్రబలుతోంది. జాతి, కుల, మత దురభిమానాలు పెచ్చరిల్లుతున్నాయి. విద్యార్థుల జీవితంలో, ముఖ్యంగా ముస్లిం విద్యార్థుల జీవితాల్లో ఒక ప్రార్థన లేదు, ఒక సద్గంధ పఠనం లేదు, ఒక సద్వచన శ్రవణం లేదు, ఆఖరికి **'కలిమా'** రాదు, దానర్థం తెలియదు. ఇక వారికి ఇది మంచి, ఇది చెడు అనే విచక్షణా జ్ఞానం ఏమయినా ఉంటుందా అంటే అదీ లేదు. ఇది ఎవరి లోపం? వ్యక్తిదా? వ్యవస్థదా?

పిల్లల్లో **'భక్తి'** వల్ల వినయం, **'పాపభీతి'** వల్ల సత్ప్రవర్తన, **'ప్రార్థన'** వల్ల క్రశిక్షణ కలుగుతాయి. ఖుర్‌ఆన్ మరియు హదీసులను నేర్పే తల్లిదండ్రుల పాలిట వారి సంతానం సౌభాగ్యం, కీర్తిగా అలరారుతారు. ఇహంలోనే కాక రేపు తీర్పు దినాన సయితం దేవుడు అట్టి సత్సంతాన తల్లిదండ్రుల్ని **'కీర్తి కిరీటాలు'** తొడిగించి మహా గొప్పగా సన్మానిస్తాడు' అని ప్రవక్త మహనీయుల (స) వారు సెలవిచ్చారు. కాబట్టి పిల్లలకు అవసరమయిన ఆధ్యాత్మిక శిక్షణ ఇవ్వడంతోపాటు **'సదా మా కళ్ళకు చల్లదనాన్ని ఇచ్చే భార్యాపిల్లలను మాకు ప్రసాదించు. మమ్మల్ని దైవభీతిపరులకు తలతండ్రి (ఇమామ్)గా చెయ్యి స్వామీ!'** అని నిత్యం ఆ నిజ ప్రభువును వేడుకుంటూ ఉండాలి.

JUN 2012.indd 8 6/4/12 11:56 AM

వాత్సల్యం - దానం



మనిషికి మరణానంతరం పనికొచ్చేవి **'సత్సంతానం, జ్ఞానం, దానం'** అని ప్రవక్త మహనీయులు (స) వారు సెలవిచ్చారు. అది తెలిసిన **తలగట్టి** తత్వవేత్తలు, మహా మేధావులెందరో తమ సంపత్తిని, సమయాన్ని, సేవని, జ్ఞానాన్ని లోక కళ్యాణం కోసం వినియోగించారు. అయితే లోకం వీళ్ళని **'బ్రతకడం చేతకాని వాళ్ళ'**ంటూ అవహేళన చేసింది. ఎంత విచిత్రం! ఎది ఏమయినా, మనం మాత్రం మన పిల్లల్లో దాన గుణాన్ని పెంపొందించాలి. అప్పుడప్పుడు వారి చేతికి డబ్బిచ్చి దానం చేయించాలి. పుచ్చుకోవడం కన్నా ఇవ్వడం ద్వారా పొందే ఆనందం చెప్పనలవి కానిది. మన పిల్లలకు పుస్తకాలున్నాయి, బట్టలున్నాయి, కాళ్ళకు చెప్పులున్నాయి. ఇవేమి లేనివాళ్ళు, మనకన్నా చిన్నవాళ్ళూ మన చుట్టూ ఎంతో మంది కనబడతారు. కాబట్టి **'మీకున్న దానిలో కాస్త స్వీటు ఆ అభాగ్యులకు ఇచ్చి చూడండి. వారి కళ్ళల్లో కనబడే ఆనందం మీరు స్వీటు తింటున్నప్పుడు కలిగే ఆనంద మకరందంకన్నా మీకెక్కువ సంతోషాన్నిస్తుంది'** అని పిల్లలను ప్రోత్సహిస్తే, సత్పౌరులయిన వారు వేలాది దానాలకు, వందలాది సేవా కార్యక్రమాలకు **తలకట్టు**గా నిలబడి, నిరతం నింగీనేలల్లో జీవరాసుల చేత నీరాజనాలందుకుంటారు.

వాత్సల్యం - సావాసం



'వ్యక్తి అతని స్నేహితుని మతధర్మం మీదే ఉంటాడు' అని ప్రవక్త మహనీయులు (స) వారు చెప్పారు. కాబట్టి **తలచెడ్డ** వాళ్ళతో సావాసం చెయ్యకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సావాసగాళ్ళందరూ మంచి వారై ఉంటారన్న గ్యారంటి ఏమి లేదు. కొందరి మెదడు మోకాళ్లలో ఉంటుంది. **తల**కు చెప్పులు అడిగే రకం అన్న మాట. అంటే కొవ్వెక్కి మాట్లాడుతారు. **తలమీరి**పోతూ, **తల**కు నొప్పిని మిగిల్చే పనులన్నింటిలోనూ **తలదూరు**స్తుంటారు. అటువంటి వ్యక్తులకు, ఉక్తులు, చెడు శక్తులకు దూరంగా ఉంచితేగాని మన పిల్లలకు శాంతి **తల కూడదు**.

ఎంత కష్ట పడ్డా అవతలివారు ఒక్కోసారి మనల్ని అభిమానించరు. ఆఖరికి **తల**కోసి ముందర పెట్టినా 'ఇదంతా **తలతిక్క** వ్యవహారం, గారడీ విద్య లాగుంద'ని చప్పరించి పారేస్తారు. అటువంటి వ్యక్తుల ప్రాపకం కోసం వృధా ఊడిగం చెయ్యకూడదని పిలల్లకు నచ్చజెప్పాలి. **తలకోట్లు** నూరి **బట్టతల**కూ మోకాలుకూ ముడివేసే జిత్తులమారి నక్కలుంటారని జాగరూక పర్చాలి.

చెడు సావాసం వల్ల భారత దేశంలో ఏటా 'లైంగిక వేధింపులకు గురయిన పిల్లల సంఖ్య అక్షరాల 6 లక్షలు. అందులో 67/శాతం బాలికలయితే, 33/శాతం బాలురుగా నమోదయింది. ఈ సర్వేలో మన పిల్లల్ని ఎత్తుకునే వారు, స్వీట్లు, చాక్లెట్లు పంచి పెట్టే వారు, ఆప్తులయినా, అధ్యాపకులయినా, వైద్యులయినా, స్నేహితులయినా – వారందరూ మంచోళ్ళయి ఉండరని తేలింది. కాబట్టి మనం మన పిల్లల్ని మూడు ప్రదేశాలకు సంబంధించిన ప్రమాదాన్ని ఆరు నెలలకోసారి అయినా గుర్తు చేస్తూ ఉండాలన్నది కొందరు మానసిక నిపుణుల మాట. **1) రొమ్ము 2) తొడలు, తొడల మధ్య స్థలం 3) పిర్రలు.** ఎవరయినా వారిని ఎత్తుకుని ముద్దాడుతూ ఈ ప్రదేశాలను తాకితే ప్రమాదం పొంచి ఉన్నట్టు అని మన పిల్లలకు బోధ పర్చడంతోపాటు తక్షణ చర్యల్ని కూడా సూచించాలి. వారికి అలా అన్పించినప్పుడు పెద్దగా కేక వేసి, ఆ స్థలం నుండి పారిపోయి సురక్షిత ప్రదేశానికి చేరుకోవాలని, తర్వాత వారికి బాగా నమ్మకమున్న వ్యక్తికి దాని గురించి తెలియజేయాలని చెప్పాలి. అలాగే ఏదైనా విషయం మన పిల్లలు మనతో చెబితే పనివాళ్లు కదా అని ఈజీగా తీసిపారేయ కూడదు. లేదంటే తర్వాత మనం చాలానే కోల్పోవాల్సి వస్తుంది. చివరకు సంతానాన్ని కూడా. అలాగే ఈ మూడు ప్రదేశాల్ని మనం చూస్తుండగా ఎవరయినా ముట్టుకుంటే వారు ఎంతటి వారయినా మందలించాలి.

అదే విధంగా పిల్లలతోనే ఎక్కు సమయం గడిపే ఆడమగవారి పట్ల కాస్త అప్రమత్తంగా ఉండాలి. పరాయి వారు ఎవరు ఏది ఇచ్చినా తీసుకో కూడదని చెప్పాలి. మనం కూడా ఇతర పిల్లలకు ఏదైనా ఇవ్వాలనుకుంటే డైరెక్టుగా పిల్లలకు ఇవ్వకూడదు, వారి తల్లి దండ్రులకిచ్చి వారికి ఇవ్వాలిస్సదిగా రిక్వెస్ట్ చేయాలి. కోరికలు తీరని కామాంధులు కొందరుంటారు. వారి చూపంతా కన్నె పిల్లల పై, చిన్న పిల్లలపైనే అన్న విషయాన్ని విస్మరించడం విషంతో సమానం అన్న విషయం గర్తుంచుకోవాలి.

వాత్సల్యం - శీల నిర్మాణం



"Think High-Acheive High" అనేది నేటి నినాదం. ఉన్నత లక్ష్యాల్ని నిర్దేశించుకుని దాని మీదే తదేక దృష్టితో పని చేయాలనే నిర్ణయం తీసుకునే **తలచూపు**ను తనయులకుతల్లిదండ్రులు ఇవ్వాలి. **'తల తిరిగి అయినా కబళం నోటికి రావాలి'** అన్నట్టు అవకాశాలు వాటికవే రావు. వాటిని మనమే అంది పుచ్చుకోగలగాలని, ఎవరో వస్తారని, ఏదో మేలు చేస్తారని ఎదురు చూసి మోసపోకూడదని వారికి నచ్చజెప్పాలి. ఒక్కొక్క మెట్టు **తలద్రొక్కు**కెళుతూ శిఖరాగ్రానికి చేరుకునే నేర్పును వారిలో నూరి పోయాలి. **తలతాకట్టు** పెట్టాల్సి వచ్చినా తీసుకున్న అప్పు, ఇచ్చిన మాట తప్ప కూడదని బోధించాలి.

అలాగే స్త్రీ ఇంటికి గుమ్మ వంటిదని, వీధి వాకిట్లో నిలబడి వచ్చి పోయేవాళ్ళతో ఒయ్యారాలు ఒలకబోస్తూ మాట్లాడటం, కరచాలనం చేయడం ఏ విధంగానూ తగదని, సంస్కారం, వ్రీడ గల సుకన్యలు గుమ్మంలోకి రారని, అలా వీధి గుమ్మంలో నిలబడటం జారస్త్రీ లక్షణం అని పెద్దలు చెప్పిన మాటను ఆడ పిల్లలకు నచ్చివచ్చేలా బోధించాలి.

వాత్సల్యం - కామం (వాంఛలు)

తాము అనుభవించలేకపోయిన సౌఖ్యాల్ని, సౌకర్యాల్ని తన పిల్లలకు అందేలా చూడాలన్న తపన దాదాపు తల్లిదండ్రులందరిలోనూ ఉంటుంది. అయితే ఏ కోరికల పరిపూర్త వల్ల పిల్లల వ్యక్తిత్వం పరిపూర్ణమవుతుందో, మరే రకపు వాంఛల పరిపూర్తి వల్ల వారి భవిత వ్యం పాడవుతుందో తెలుసుకునే కనీస విచక్షణాజ్ఞానం తల్లిదండ్రులకు లేకపోతే.....

JUN 2012.indd 9 6/4/12 11:56 AM

..**'తలపుళ్ళు కడిగాము, ఇవ్వాళ ప్రయోజకులయి సంపద వచ్చే సరికి అన్ని మర్చిపోయారు'** అని తీరిగ్గా కూర్చోన్ని బాధ పడక తప్పదు. కనుక పిల్లలు, తలతిక్క పనులు చేసినా, **తలకెక్కిన** కోర్కెలు కోరినా వారిని మందలించాలి. వాటి వల్ల కలిగే నష్టాన్ని వివరించాలి, అప్పటికీ వినకపోతే **'తలకోల పోట్ల గిత్తకు ఇది అవసరం'** అన్నట్టు నాలుగు తగిలించాలి కూడా. తప్పని స్థితిలో కొట్టడం వాత్సల్యానికి వ్యతిరేకం ఎంతమాత్రం కాదు, అది మనకు వారి మీదున్న వాత్సల్య అవసరం. అయితే గొడ్డును బాదినట్టు బాదడం గానీ, చీకటి గదిలో బంధించడంగానీ, అన్నం మాన్పించడం, వాతలు పెట్టడం, కళ్ళల్లో కారం పోయడం వంటివి గాని చేయకూడదు.



'తలలు బోడులయినా తలపులు బోడులవు తాయా?' అన్నట్టు వయసుతోపాటు వచ్చే మార్పు వారిని వింతానుభూతికి లోను చేస్తుంది. అప్పటి వరకు తల్లిదండ్రులే సర్వస్వం అయిన వారి లోకంలోకి కొత్త పరిచయాలు తొంగిచూడాలన్న తాపత్రయం బయలు దేరుతుంది. అట్టి క్లిష్ట స్థితిలో వారు స్పందించాల్సిన తీరును, వాటిని ఎదుర్కొనే ధైర్యాన్ని వారికి నేర్పాలి. **'పిల్లలు పదవ ఏటకు చేరితే (వారు స్వంత అన్నాచెల్లెలయినా, అక్కాతమ్ముళ్లయినా) వారి పడకలను వేరు చేయమ'**ని ప్రవక్త (స)వారు సెలవిచ్చి ఉన్నారు. అలాగే సమీప బంధువుల మధ్య ఉండే అతి సనువుకు వారిని దూరంగా ఉంచాలి. ఈ నియమాన్ని ఖచ్చితంగా మన ఇళ్ళల్లో అమలు పర్చాలి.

వాత్సల్యం - సహనం

'తలచినప్పుడే తాత పెళ్ళి' అన్నట్టు తొందర పాటు నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్త పడాలి. చక్కటి మైత్రినీ, స్నేహాన్నీ, నడవడినీ కలిగి ఉంటూ, అందరి **'తలలో నాలుకలా తయారవ్వా'**లని హితవు పలకాలి. అవినీతి, కుళ్ళుమోతు తనం, ఎదుటి వారి అభివృద్ధిని సహించకపోవడం వంటి కొట్లమారితనం అనే గుణానికి దూరంగా ఉండమని బోధించాలి. భావోద్వేగ నిబద్ధతను వారిలో నూరిపోయాలి. కష్టమొచ్చినప్పుడు కంగారు పడకుండా అటు వంటి నిబద్ధతతో సమస్యకు పరిష్కారం దొరకుతుందని బోధపర్చాలి.

వాత్సల్యం - వ్యాయామం



ఏడు సంవత్సరాల వరకు పిల్లల్ని ఆడుకోనివ్వాలని, తర్వాత వారికి నమాజు గురించి చెప్పాలని' ప్రవక్త మహనీయులు (స) వారి ప్రవచనం ద్వారా తెలుస్తుంది. వ్యాయామం అనేది రెండు రకాలు. క్రీడా వ్యాయామం. **విద్యా వ్యాయామం:** సాధారణంగా పిలల్లలో చాలా హడావిడి, చురుకుతనమూ ఉంటుంది. వాటిని శక్తిగా మార్చాలి. ఈ హడావుడి అనేది **'పామువిషం'** లాంటిది. చంపటానికి, బ్రతికించడానికి కూడా పనికొస్తుంది చిన్నతనంలో మన పిల్లల చురుకుదనాన్ని సవ్యమయిన మార్గంలో మళ్ళించకపోతే, పెద్దయ్యాక అది **'కంగారు'**గా మారుతుంది. కాబట్టి కొందర వ్యక్తుల్ని మనం చూస్తాము. వారు చాలా చిన్న విషయాలకే హడావుడి పడుతూ ఉంటారు. సమస్యల్ని తొందరగా పరిష్కరించాలనే తాపత్రయంతో తప్పుడు నిర్ణయాలు తీసుకుమటూ ఉంటారు. నిజానికి అప్పుడే **'నిగ్రహం'**పాటించాలి. దీన్ని చిన్నతనం నుంచే పిల్లలకు నేర్పాలి. ఫజిల్స్, పొడుపు కథల్లాంటివి చెప్పి విప్పమనాలి. తేలిక ప్రశ్నే కదా అని పిల్లలు హడావుడి జవాబులు చెబుతారు. అది తప్పయినప్పుడు వారికి **'నిగ్రహం'** విలువని చెప్పాలి. భవిష్యత్తులో ఆ నిబద్ధతే వారికి చాలా సాయపడుతుంది. ఇది విద్యా వ్యాయామం.

క్రీడా వ్యాయామం – పిల్లలు కొందరిలానే ఫలితం తెలియకుండా పని చేస్తారు. ఒక కుర్రాడు గది చుట్టూ చక్కర్లు కొడుతున్నాడనుకుందాం. **'ఎక్కడికి నీ పరుగు? ఏ గమ్యం చేరుకోవడానికి?'** అని ప్రశ్నిస్తే వాడి దగ్గర సమాధానం ఉండదు. వారి లోపల్నుంచి ఉవ్వెత్తు ఎగిసి పడుతున్న శక్తిని కాల్చేయడం కోసమే పిల్లలు ఆ విధంగా పరుగెత్తడం, గంతులేయడం, అతిగా మాట్లాడటమ, కొట్టుకోవడం, బల్లపై నుంచి దూకడం వగైరా చేస్తూ ఉంటారు. నిరంతరం వారిలో విడుదలయ్యే **'అంతర్గత శక్తి'**ని మంచి దారిన మళ్ళిస్తే వారు అద్భుతమైన వ్యక్తులుగా ఎదుగుతారన్నది మానసిక నిపుణుల మాట. కాబట్టి వారి పరుగుకి, వేగానికి, దూకుడికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించడంపెద్దల బాధ్యత.అయితే ఈ మధ్య తల్లిదండ్రులు పేరు కోసమో, ప్రాపకం కోసమో తెలియదుగానీ, వారి పిల్లల అంతర్గత శక్తిని పెద్దయ్యాక వారికి ఏ విధంగానూ పనికి రాని పాటల పోటీల్లో, డ్యాన్స్ పోటీల్లో తగుల బెట్టి మురిసి పోతున్నారు. వారు ఈ చర్యకు స్వస్తి పలకకపోతే, **'పధ్నాల్గో ఏట నుంచి పబ్బులకు, క్లబ్బులకెళ్ళే సంతానమే-సంతా పమే'** వారికి మిగులుతుందని మరువ కూడదు.

వాత్సల్యం - ప్రోత్సాహం



'తల వెంట్రుకకు కూడా నీడ ఉంటుంది' అన్నట్టు మనం చాలా చిన్నవిగా భావించి అశ్రద్ధ వహించే విషయాలలో మహోపకారాలు చేసేవి చాలానే ఉంటాయి. అది మెచ్చుకోలుగా భుజం తట్టడమే కావచ్చు, నగుమోముతో మాట్లాడటమే కావచ్చు, బహుమానం ఇవ్వడమే కావచ్చు, విహారయాత్రకు తీసుకెళ్ళడం కావచ్చు. అయితే మన పొగడ్తకు, ప్రోత్సాహానికి, చిరునవ్వుకు, ఇచ్చే బహుమానానికి ఒక లక్ష్యం ఉండాలి. మనం ఎందుకు వారిని మెచ్చుకుంటున్నామో, ఎందుకు వారితో నవ్వుతూ మాట్లాడుతున్నామో, ఎంతగా వారిని ప్రేమిస్తున్నామో, ఎందుకు బహుమానాన్ని ఇస్తున్నామో వారి అర్థమయ్యే రీతిన చెప్పగలగాలి. నాన్న గనక గిఫ్ట్ ఇచ్చాడు అన్న ఫీలింగ్ కన్నా **'నేను సాధించిన ఫలానా విజయానికి మెచ్చుకోలుగా నాకు లభించిన బహుమానం ఇద'**ని అతను సంతృప్తి, సంతోషం చెందాలి. ఒక వేళ మన పిల్లలు ఏదోక కారణంగా దిగులు చెందినట్టు మనకు అన్పిస్తే, వారిని వారి మానాన వదలకుండా – **'గాలి ప్రేమతో స్పర్శించి ప్రేమగా పలుకరించినట్లు, చెట్ల కొమ్మలు చెతులూపుతూ ధైర్యం చెప్పినట్లు, పర్వతాలు స్థిరంగా ఉండటం ఎలాగో నేర్పినట్లు'** మనం వారికి ఒక అనురాగ స్పర్శను, ఒక అభయ హస్తాన్ని, ఒక సహన స్థయిర్యాన్ని ఇవ్వగలగాలి. ఇస్తారని ఆశిస్తూ.....!

JUN 2012.indd 10 6/4/12 11:56 AM

ఐపిసి వార్తలు

ఆసిమా బ్రాంచ్ ఆధ్వర్యంలో

ఐపిసి ఆసిమా బ్రాంచ్ తెలుగు సెక్షన్ ఆధ్వర్యంలో 04-05-2012 తేదీన ఐపిసి విద్యార్థులు సాల్మియాలోని సైన్స్ మ్యూజియంను సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా **'సృష్టిలో దేవుని నిదర్శనాలు'** అన్న అంశంపై ఐపిసి ప్రబోధకులు సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ మాట్లాడుతూ– వినగలిగే వీనులుండాలేగానీ, చూడగలిగే కళ్ళుండాలేగానీ, గ్రహించగలిగే మనస్సుండాలేగానీ సృష్టిలో కానవచ్చే దైవ నిదర్శనాలు ఎన్నెన్నో. సృష్టి గురించి, సృష్టి నిర్మాణం గురించి, మానవ జీవన్మరణాల గురించి ఆలోచించమని ఖుర్ఆన్ పిలుపునిస్తుందన్నారు. పూర్వం ఖుర్ఆన్ ఈ పిలుపుని స్వీకరించిన ముస్లింలు వైజ్ఞానిక రంగంలో అద్భుతాలు చేశారని, నేడు సయితం ఆ దిశగా ముస్లిం జనావళి దృష్టి సారించాల్సి ఉందన్నారు. తర్వాత అందరూ ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సముద్ర జీవాలను, షార్క్ చేపలను సందర్శించుకున్నారు. ఇంతటి చక్కటి అవకాశాన్ని కల్పించినందుకు అందరూ ఐపిసి యాజమాన్యానికి నిండు హృదయంతో ధన్యవాదాలు తెలియజేశారు.














హమ్మా మరియు టి ఎం ఎ వారి ఆధ్వర్యంలో

ఫీమా అనుసంధాన సంస్థలయిన హమ్మా మరియు టిఎమ్ఏ ఆధ్వర్యంలో **'రండి ఖుర్ఆన్‌ను సులభంగా అర్థం చేసుకుందాం!'** అన్న బ్యానర్ క్రింద ఖుర్ఆన్ అన్‌డర్‌స్టాండ్ అకాడమి డైరెక్టర్ డా.అబ్దుర్రహీమ్ గారి పర్యవేక్షణలో రెండు రోజుల ట్రైనింగ్ కోర్స్ నిర్వహించ బడింది. ఆద్యంతం ఎంతో విజ్ఞానదాయకంగా, ఉల్లాసభరితంగా సాగిన ఈ కార్యక్రమం అమోఘం. తనదైన చక్కటి శైలితో, స్వీయ అనుభవాన్ని జోడించి ప్రేక్షకులకు ఖుర్ఆన్ నేర్పిన తీరు అద్భుతం. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు ఇటువంటి కార్యక్రమం పల్లెపల్లెకు విస్తరించేలా ప్రణాళికలు ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. దాదాపు 15 భాషలలో **'ఖుర్ఆన్ సులువుగా నేర్చేకానే'** పవర్ పాయింట్స్ నెట్ మీద **http://understandquran.com** అందుబాటులో ఉన్నాయి. ఈ కార్యక్రమానికి ఐపిసి జనరల్ మేనేజర్ శ్రీ అబ్దుల్ అజీజ్ ఆద్దువైజ్ గారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమాన్ని, నిర్వహకులైన సంస్థలను ఆయన శ్లాఘించారు.

JUN 2012.indd 11 6/4/12 12:10 PM



ఇస్లాం ధర్మం ఏయే దేశాలకు చేరిందో అక్కడి సమాజాలను, నాగరికతలను, సంస్కృతి-శిక్షాస్మృతులను ప్రభావితం చేసింది. ఇస్లాం ధర్మానికి మూలమయిన దివ్యఖుర్‌ఆన్ ప్రబోధాల కారణం గా ఓ శతాబ్దం పాటు ప్రపంచ నాగరికత ప్రభావమయింది. దివ్య ఖుర్‌ఆన్ చూపించినంత ప్రభావం మానవ చరిత్రలో మరే గ్రంథమూ చూపలేదు. ఆ గ్రంథాన్ని నమ్మని వారిని సయితం అది ప్రభావితం చేసింది, వివేచన, విజ్ఞానం, విమోచనల విషయంలో నవీన కాంతులీనింది. సమస్త మానవాళికి సమగ్రంగా మార్గ నిర్దేశన చేయగలిగే ఒనరు ఈ దివ్యగ్రంథరాజం. నాడే కాదు ప్రస్తుతం,ప్రళయం వరకు మానవాళికి ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపగల ప్రత్యే సూత్రం అందులో ఉంది. కవి కోకిల సరోజిని నాయుడు ఖుర్‌ఆన్ విశిష్ఠతను చాటుతూ ఇలా అన్నారు: **"న్యాయమన్నది ఇస్లాం ఆదర్శాలలో ఒకటి. నేను ఖుర్‌ఆన్ చదివి నప్పుడు గొప్ప జీవన సిద్ధాంతాలు చూశాను. ప్రపంచమంతటికీ నిజ జీవితంలో ఆచరణీయమయిన నైతికతలే అందులో ఉన్నాయి".** (స్పీచెస్ అండ్ రైటింగ్ ఆఫ్ సరోజినీ నాయుడు, మద్రాస్, 1918, పేజీ 167)

మనిషి బలమైన భావోద్వేగాలకు లోనయినప్పుడు కూడా న్యాయమే చేయమని ఇస్లాం కోరుతుంది. సాధారణ పరిస్థితుల్లో న్యాయం చెప్పుకోదగ్గ డిమాండ్‌గా ఉండదు. కాని బలమైన భావో ద్రేకాలు, ప్రేమ, ద్వేషం వంటివి ఎదురయినప్పుడు న్యాయం చెయ్యడం ఆన్నది సులువైన ఆషామాషి విషయం కాదు. విశ్వాసాధికారంతో ఇస్లాం అలాంటి స్థితిలో సయితం మనిషిని న్యాయానికి కట్టుబడి ఉండేలా చేస్తుంది.
"విస్వసించిన ప్రజలారా! న్యాయ ధ్వజవాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హానీ కలి గించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేదలయినా అల్లాహ్ వారి శ్రేయస్సు మీకంటే ఎక్కువగా కాంక్షిస్తాడు. కనుక మీ మనో వాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగ కండి. మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్ని దాటవేస్తే, బాగా తెలుసుకోండి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు".
(దివ్యఖుర్‌ఆన్-4: 135)

అయితే సత్యం ఎప్పుడూ అసత్యవాదుల పాలిట పచ్చి వెలక్కాయ గానే పరిణమిస్తూ వచ్చింది. అందువల్లనే ఇస్లామీయ ఉద్యమ ప్రభావం ఉధృతం అయ్యేకొద్దీ అవిశ్వాసుల మనోవ్యాధి కూడా ఎక్కువ అవుతూనే ఉంది. ఫలితంగా వారు ఇస్లాం గురించి, ఖుర్‌ఆన్ గురించి, మానవ మహోపకారి అయిన మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారి గురించి నాటి నుండి నేటి వరకూ నోటి కొచ్చినట్లు దుర్భాషలాడుతూనే ఉన్నారు. అపనిందలు మోపుతూనే ఉన్నారు. కుట్రలు పన్నుతూనే ఉన్నారు, సైన్యాల్ని ముస్లింలపై ఉసిగొల్పుతూనే ఉన్నారు. వారి జన వాసాలను ఖనన వాటికలు గా మారుస్తూనే ఉన్నారు. నాటి యూదుల కుయుక్తులు, తాతార్‌ల రక్తపాతాలు, క్రూసెడ్ యుద్ధాల ఊచకోతలు మొదలు నేటి అగ్ర రాజ్యాల అనవసర జోక్యం వరకూ వారు సత్యజ్యోతి ఆర్పివేసేందుకు శత విధాలా ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అయినా సమాజంలోని సద్వర్తనులు ఇస్లాం ఛత్రఛాయల్లోకి వస్తూనే ఉన్నారు. నానాటికి అధికమవుతున్న ముస్లింల సంఖ్య చూసి అవిశ్వాసులు మరింత కలవరపడుతున్నారు. మరిన్ని కుట్రల కోసం ప్రణాళికబద్ధంగా సిద్ధమవుతున్నారు. వారు పన్నే కుట్రలు ఎంత భయంకరమయినవంటే పర్వతాలు సయితం వాటి స్థానం నుంచి వైదొలిగిపోయేంత. నిజం దైవ సహాయమే గనక లేకపోయి ఉంటే గతంలో వారు పన్ని కుట్రలకు, ప్రస్తుతం పన్నుతున్న కుట్రలకు ముస్లిం అన్న వ్యక్తే ధరణిపై ఉండేవాడు కాదేమో. ఇంత చేసినా ఇస్లాంగానీ, ముస్లింలుగాని అవలబించిన తీరు ఎటువంటిదో, ముస్లింలందరినీ భూస్థాపం చేసెయ్యాలని వచ్చిన భయంకరులు ఎలా సత్యధ్వజవాహకులయ్యారో చరిత్రే సాక్షి. ఇది తెలిసిన గాంధి గారు ఇలా అన్నారు:
"ఇస్లాం హింసాత్మకమైనది కాదు. పైగా శాంతిని కోరేది. ప్రతీ కారం కంటే సహనాని (క్షమించడాని)కే అది పెద్ద పీట వేస్తోంది. ఇస్లాం అంటేనే శాంతి, అహింస". (గాంధీ మార్గ్, సంపుటి 25, నంబర్ 3, అక్టోబరు-డిసెంబరు 2003) చూడండి -

'ఇఫ్క్' సంఘటనకు అసలు సూత్రధారి, పాత్రధారి అయిన కపటి అబ్దుల్లాబిన్ ఉబై దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారికి వ్యతిరేకం గా ఎన్నో కుట్రలు పన్నాడు. **'మదీనా వెళ్ళాక గౌరవనీయుడు నీచుడ్ని వెళ్లగొడ్తాన'**న్నాడు. అతను కపటనాటక సూత్రాధారి అన్న విషయం అతని కుమారుడయిన అబ్దుల్లాహ్‌కు సయితం తెలుసు. ఆయన మదీన ముఖ ద్వారం వద్దకు చేరుకుని తండ్రిని నగరం లో ప్రవేశించనీయకుండా అడ్డగించారు. దైవ సాక్షి! మిమ్మల్ని దైవ ప్రవక్త (స) అనుమతించనంత వరకు నేను మిమ్మల్ని పట్ట ణంలోకి అడుగు పెట్టనీయను' అని కత్తి దూసి చూపించాడు. ఇబ్బె ఉబై బిత్తరబోయి **'ప్రజలారా! నా కొడుకే నన్ను పట్నంలో ప్రవేశించనీయకుండా నిరోధిస్తున్నాడు. ఇదెక్కడి న్యాయం!'** అంటూ కేకలు పెట్టాడు. -ఈ విషయం తెలుసుకున్న కారుణ్యమూర్తి ముహమ్మద్ (స) **'వెళ్ళి అబ్దుల్లాహ్‌కు చెప్పండి వాళ్ళ నాన్నను ఇంటికి రానివ్వమ'**ని అని ఆదేశించారు.

JUN 2012.indd 12 6/4/12 12:23 PM

ప్రవక్త (స) ఈ కపటి పట్ల కనబర్చిన ఔదార్యానికి, ఆయన క్షమాగుణానికి అతని వంశస్థులంతా ఎంతో ప్రభావితులయినా ఆ దుర్మార్గుడి ప్రవర్తనలో ఎలాంటి పరివర్తన రాలేదు. పైగా మరింత పెచ్చరిల్లాడు. అదే సమయంలో **'ప్రవక్త (స) తన తండ్రి ఇబ్నె ఉబైను చంపాలనుకుంటున్నారన్న'** వార్త ఎవరో చెబుతుండగా అబ్దుల్లాహ్ చెవిన పడింది. తక్షణమే ఆయన దైవ ప్రవక్త (స) వారి సన్నిధికి వెళ్ళి ఇలా విన్నవించుకున్నారు: **'ఓ దైవ ప్రవక్తా! నేను విన్న మాట నిజమయితే, ఆ ఆదేశం ఎవరికో కాదు నాకే ఇవ్వండి. అల్లాహ్ సాక్షిగా చెబుతుఉన్నాను నేను నా తండ్రిని చంపడంలో వెనుకాడను. ఎందుకంటే, ఎవరో నా తండ్రిని హత్య చేస్తే నేను చూసి ఊరుకోలేను. ఖచ్చితంగా నేనా వ్యక్తి చంపేస్తాను. ఫలితంగా నరకానికి వెళతానన్న భయం నన్ను వెంటాడుతోంది. నేను మా నాన్న ముద్దుల కొడుకు, పరమ విధేయుడినన్న విషయం అన్సారులందరికి తెలుసు'.** అది విన్న దైవ ప్రవక్త (స) మేలే జరుగుతుంది అని చెప్పి అతన్ని దీవించారు. తర్వాత **'నీ తండ్రితో మంచిగా వ్యవహరించు. నీ నుండి ఆయన మేలును మాత్రమే చూడాలి'** అని హితవు పలికి సాగనంపారు.

ఈ సంఘటనలో అబ్దుల్లా తన భావోద్రేకాలను మేలిమి మేధ ద్వారా అదుపు సాధించారు. ఇది ఆషామాషి విషయం కాదు. మనస్సుపై చాలా భారమయిననది. అయినా కపటనాటక సూత్రాధారి అయిన తన తండ్రిని సయితం హతమార్చేందుకు సిద్ధమయ్యారు. కానీ, ప్రవక్త (స) ఇక్కడ సయితం క్షమను, కరుణను కనబర్చడమే కాకుండా ఎటువంటి చెడును నీ నుండి నీ తండ్రి చూడకూడదని హితవు పలికి మరీ పంపారు.

మహా ప్రవక్త (స) వారి ఆరాధన విధానాన్ని తెలుసుకున్న కొందరు యువకులు, ప్రవక్త (స) వారి ప్రార్థనల ముందు తమ ప్రార్థనల్ని అల్పంగా భావించి నిరంతరం ఉపవాసాలు పాటిస్తాము అని, రాత్రిళ్ళు నిద్రపోకుండా ఆరాధనలో గడుపుతామని, జీవితాంతం స్త్రీలకు (వైవాహిక జీవితానికి) దూరంగా ఉండిపోతామని భక్తి, భావోద్రేకాలకు లోనై ప్రతిజ్ఞ చేశారు. మరో సహాబి అయితే, అడవి ప్రాంతంలో మంచి నీటి చెలమ ప్రక్కన ఓ నిండు ఫలాలతో తులతూగే వృక్షాన్ని చూసి అక్కడికెళ్ళి వైరాగ్య జీవితం గడిపే అనుమతి కోరారు. ఈ నేపథ్యంలో మహా ప్రవక్త (స) వారు చెప్పిన మాటలు గమనార్హం! **'వీరికేమయింది? స్త్రీలను (వైవాహిక జీవితాన్ని), మంచి ఆహార పదార్థాలను, సువాసనను, నిద్రను, ఇతరత్రా ప్రాపంచిక సౌఖ్యాలను నిషేధించుకున్నారు? నేను మీకు వైరాగులుగా, సన్యాసులుగా మారమని బోధించలేదు. నా శిక్షాస్మృతిలో స్త్రీల సాంగత్యాన్ని (వైవాహిక జీవతాన్ని) మాంస హారాన్ని త్యజించాలని లేదు. అలాగే బైరాగులయి ఏకాంతకుహూరాల్లో తిష్ఠ వేసుకు కూర్చోవాలని కూడా లేదు. ఆత్మ నిగ్రహం కోసం నా షరీయతు (ధర్మ శాస్త్రం)లో ఉపవాసం ఉంది. వైరాగ్య ప్రయోజనాలన్నీ ఇక్కడ జిహాద్ ద్వారా సమకూరుతాయి. (కనుక) అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు మరెవరిని సాటి కల్పించకండి. హజ్జ్ఉమ్రాలు నిర్వహించండి. నమాజు స్థాపించండి. మీకు పూర్వం ప్రజలు తమపై లేనిపోని ఆంక్షల భారం, కాఠిన్యాలు మోపుకున్నప్పుడు దేవుడు కూడా వారిపై బరువులు, కాఠిన్యాలు మోపాడు. మీకు మఠాలలో, ఆశ్రమాలలో, ఏకాంత కుహురాల్లో కన్పిస్తున్న అవశేషాలు వారు వదలిపెట్టి పోయినవే".** (బుఖారీ, ముస్లిం)

భక్తిభావ తరంగాలు ఉవ్వెత్తు లేచినప్పుడు ఈ విధమైనటువంటి మనోద్రేకానికి, భావావేశానికి గురవుతుంటారు సుభక్త జనాలు. అయితే ధర్మం గీసిన సరిహద్దు రేఖను దాటకూడదు. అందులో మన శ్రేయసాఫల్యాలు దాగున్నాయి.

"నేడు మీ ధర్మాన్ని నేను మీకై పరిపూర్ణం చేశాను. నా వరప్రసాదాన్ని నిశ్శేషంగా అందజేశాను. ఇస్లాంను మీ కొరకు మీ జీవన విధానంగా ఆమోదించాను". (మాయిదా: 3) అని అల్లాహ్ సెలవిస్తున్నాడు.

శతాబ్దులపాటు ఇస్లాం సుస్థిర ఆలోచనా విధానంగా, ఆచరనా వ్యవస్థగా అలరారింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. భావోద్వేగానికి న్యాయానికి మధ్య అది పాటించినంత సమతౌల్యాన్ని మరే మతమూ పాటించలేదు. అందులో స్థూలంగానూ విపులంగానూ జీవిత సకల సమస్యలకు పరిష్కారం ఉంది. పరిపూర్ణమయిన సంస్కృతీనాగరికల వ్యవస్థగా దాన్ని తీర్చిదిద్దింది ఎవరో కాదు స్వయంగా అల్లాహ్‌యే. ఇకపై మార్గదర్శకత్వం కొరకు దాని పరిధి వెలుపల దృష్టిసారించవలసిన అనసరం లేదు. అది మానవునికీ, జంతువుకూ, చెట్టుకూ, ఇంకా ధరణిలో ఉన్నవాటన్నింటికీ శ్రేయాన్ని ప్రసాదించింది. దాని నీడలో మానవత, దాని ప్రకృతి ఉద్దిష్టమయిన ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఘనత కూడా దానికి దక్కింది. అందులో భూ వనరుల వినయోగం మానవ ప్రగతికే దోహద పడింది కాని వినాశానానికి కాదు.

ప్రవక్తలందరి జీవన విధానమయిన ఇస్లాం అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారిపై పరిపూర్ణ గావించబడిన అనతి కాలంలోనే దాని సూత్రాలు, దృక్పథాలకనుగుణంగా ఒక ప్రత్యేక మయినటువంటి మేలిమి సంస్కృతి ఉనికిలోకి వచ్చింది. అది జీవన వివరాలన్నింటిలోనూ ఇతర సంస్కృతలపై ఆధిక్యతను సాధించుకుంది. నైతిక, సమాజిక, ఆర్థిక, నాగరిక వ్యవహారాలన్నింటిలోనూ తనదైన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంది. ప్రతి జనవాసంలో, ప్రతి తెగలోనూ నమాజు చేయించే స్థానిక నాయకులు నియుక్తులయ్యారు. ఇస్లామీయ శాసనాలు, సివిల్ చట్టాలు, క్రిమినల్ చట్టాలు రూపొందాయి. లావాదేవీల, క్రయవిక్రయాల పాత పద్ధతులు రద్దయి కొత్తగా సంస్కరించబడ్డ విధానాలు అమలులోకి వచ్చాయి. వారసత్వపు ప్రత్యేక నియమావళి రూపొందింది. పెళ్ళి విడాకుల చట్టాలు, షరీయతు పరిధిలో పరదా, ఇంట్లో ప్రవేశించేందుకు అనుమతి పొందే నియమాలు జారీ అయ్యాయి. వ్యభిచారానికి, అబద్దపు ఆరోపణలకు శిక్ష విధించడం మొదలయింది. ఫలితంగా ముస్లింల జీవితంఒక ప్రత్యేక మూసలో పోత పొసుకుంది. ముస్లింల నడత, నడక, మాటామంతి, భోజన పానీయాలు, వేష నివేశనాల పద్ధతులు సయితం ఓ ప్రత్యేక రూపు ధరించాయి. అవే ఆనవాళ్ళు నేటికీ మానవ ప్రపంచంలో ప్రస్ఫుటంగా కానవస్తున్నాయి. **(సమాప్తం)**

JUN 2012.indd 13 6/4/12 12:24 PM

న్యూ ముస్లింల, అరబ్బేతర ముస్లింల కొరకు సులైమాన్ సాలెహ్ రుహైమానీ 11వ దివ్య ఖుర్ఆన్ కంఠస్థ పోటీలు



మొదటి గ్రూపు 12 ఏండ్లలోపు బాల

1- ఒక పారా కంఠస్థ పోటీ: మొదటి బహుమతి 80 KD
రెండవ బహుమతి 70 KD మూడవ బహుమతి 60 KD

2- సగం పారా కంఠస్థ పోటీ: మొదటి బహుమతి 70 KD
రెండవ బహుమతి 60 KD మూడవ బహుమతి 50 KD

3- 12 సూరాల కంఠస్థ పోటీ: మొదటి బహుమతి 60 KD
రెండవ బహుమతి 50 KD మూడవ బహుమతి 40 KD
(ప్రతి బహుమతికి అర్హులు ఇద్దరు. ఒక బాలుడు ఒక బాలిక చొప్పున)

1- ఒక పార కంఠస్థ పోటీ: 5 సంవత్సరాలకు పైబడి
2- 20 సూరాల కంఠస్థ పోటీ: (ఇస్లాం స్వీకరించి 3 నుండి 5 ఏండ్లు నిండినవారు)
3- 12 సూరాల కంఠస్థ పోటీ: (ఇస్లాం స్వీకరించి ఏడాది నుండి మూడేండ్లు)
4- 7 సూరాల కంఠస్థ పోటీ: (ఇస్లాం స్వీకరించి ఒక ఏడాది కాలం కూడా కానివారు)

రెండవ గ్రూపు న్యూ ముస్లింలు

1 పారాల కంఠస్థ పోటీ: మొదటి బహుమతి 110 KD
రెండవ బహుమతి 100 KD మూడవ బహుమతి 90 KD

2- 20 సూరాల కంఠస్థ పోటీ: మొదటి బహుమతి 80 KD
రెండవ బహుమతి 70 KD మూడవ బహుమతి 60 KD

3- 12 సూరాల కంఠస్థ పోటీ: మొదటి బహుమతి 70 KD
రెండవ బహుమతి 60 KD మూడవ బహుమతి 50 KD

4- 7 సూరాల కంఠస్థ పోటీ: మొదటి బహుమతి 60 KD
రెండవ బహుమతి 50 KD మూడవ బహుమతి 40KD
(ప్రతి బహుమతికి అర్హులు ఇద్దరు. ఒక స్త్రీ ఒక పురుషుడు చొప్పున)

JUN 2012.indd 14 6/4/12 12:24 PM



మూడవ గ్రూపు
అరబ్బేతర ముస్లింలు

1- 5 పారాల కంఠస్థ పోటీ: మొదటి బహుమతి 180 KD
రెండవ బహుమతి 170 KD మూడవ బహుమతి 160 KD

2- 4 పారాల కంఠస్థ పోటీ: మొదటి బహుమతి 160 KD
రెండవ బహుమతి 150 KD మూడవ బహుమతి 140 KD

3- 3 పారాల కంఠస్థ పోటీ: మొదటి బహుమతి 140 KD
రెండవ బహుమతి 130 KD మూడవ బహుమతి 120 KD

4- 2 పారాల కంఠస్థ పోటీ: మొదటి బహుమతి 120 KD
రెండవ బహుమతి 110 KD మూడవ బహుమతి 100 KD

5- 1 పారా కంఠస్థ పోటీ: మొదటి బహుమతి 100 KD
రెండవ బహుమతి 90 KD మూడవ బహుమతి 80 KD

(ప్రతి బహుమతికి అర్హులు ఇద్దరు. ఒక స్త్రీ ఒక పురుషుడు చొప్పున)

నియమ నిబంధనలు

- ఈ పోటీలు న్యూ ముస్లింల కొరకు, అరబ్బేతర ముస్లింల కొరకు మాత్రమే ప్రత్యేకం.
- ఈ పోటీలలో స్త్రీలు, పురుషులు కూడా పాల్గొనవచ్చు. ఇరువురికి వేర్వేరు బహుమతులుంటాయి.
- పేర్లు నమోదు చేసే సమయంలో సివిల్ ఐడి తప్పకుండా సమర్పించాలి.
- ఇస్లాం స్వీకరించినట్లు సర్టిఫికెట్ తప్పకుండా ఉండాలి.
- క్రితం సారి పోటీలలో బహుమతులు గెల్చినవారు మళ్ళీ అదే విభాగంలోగానీ, దానికన్నా దిగువ స్థాయిలో గానీ పాల్గొనలేరు. ఎగువ స్థాయిలో మాత్రమే పాల్గొనవలసి ఉంటుంది.
- దరఖాస్తు ఫారంలో మీ మొబైల్ నెంబరును తప్పక నమోదు చేయాలి.
- దరఖాస్తు ఫారాలు ఇవ్వవలసిన ఆఖరు తేది 10-07-2012
- ఈ పోటీ పరీక్షలు 30-07-2012 నుండి 02 -08-2010 తేదీలలో జరుగుతాయి. పాల్గొనేవారికి ఎస్ఎమ్ఎస్ ద్వారా సమాచారం అందజేయబడుతుంది.
- బహుమతి ప్రదాన కార్యక్రమం వేరుగా జరుగుతుంది. ఈ తేదీ తరువాత ఎస్ఎమ్ఎస్ ద్వారా తెలుపబడుతుంది.

మీ పేర్లు నమోదు చేయవలసిన కేంద్రాలు

1) ipc, కువైట్ సిటీ (పురుషులకు మాత్రమే)
2) ipc జహ్రా బ్రాంచ్ (స్త్రీలు, పురుషులు కూడా)
3) ipc ఖైతాన్ బ్రాంచ్ (స్త్రీలు, పురుషులు కూడా)
4) ipc రౌదా బ్రాంచ్ (స్త్రీలు మాత్రమే)
5) ipc మన్గఫ్ బ్రాంచ్ (స్త్రీలు, పురుషులు కూడా)
6) KPCC, ఫర్వానియా (స్త్రీలు, పురుషులు కూడా)
7) ipc వఫ్రా, అమ్గరా, సబాహియా బ్రాంచ్‌లు (స్త్రీలు, పురుషులు కూడా)
8) IPC సాల్మియా

పోటీలు నిర్వహించబడు కేంద్రాలు

కువైట్‌లోని మస్జిద్ అల్ కబీర్ (పురుషులకు మాత్రమే)
ipc రౌదా బ్రాంచ్ (స్త్రీలకు మాత్రమే)

JUN 2012.indd 15 6/4/12 12:24 PM

ముఖ్య గమనిక:

1) ఫారంలో ఏ సమాచారం కొరవడినా అది చెల్లదు.
2) ఫారంతోపాటు బతాఖా కాపి లేకపోయినా అది చెల్లదు.
3) న్యూముస్లింల ఫారంలో ఇస్లాం స్వీకరించినట్లు సర్టిఫికెట్ లేకపోయినా అది చెల్లదు.
4) పూర్వ పరీక్ష 25-06-2012 నుండి 15-07-2012 వరకు జరుగుతుంది.
5) ఈ పూర్వ పరీక్షలో సెలక్ట్ అయినవారే అసలు పరీక్షలో పాల్గొనేందుకు అర్హులు
6) అంతిమ పరీక్ష పురుషులకు రమజాను మాసంలో మస్జిద్ కబీర్‌లోని ఫారిస్ హాలులో జరుగుతుంది.
7) **పరీక్ష తేది:** 30-07-2012 నుండి 02-08-2012 వరకు
సమయం: మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 4:30 వరకు
రాత్రి 8:45 నుండి 10: 45 వరకు
8) స్త్రీలకు సంబంధించిన పూర్వ పరీక్ష మరియు తర్వాత పరీక్ష రౌదాలో జరుగుతుంది.

వివరాల కోసం సంప్రదించండి:

పురుషుల విభాగం: అబ్దుల్ ముసవ్విర్ 22444117/208 మొబైల్ నం: 97266683
ఏజాజుద్దీన్ ఉమ్రీ 22444117/160 మొబైల్ నం: 66358123
స్త్రీల విభాగం: 22511301 - 22511305 (ఆదివారం నుండి గురువారం వరకు)

దరఖాస్తు ఫారం

ఫోటో

1) పూర్తి పేరు: .....
2) కువైట్ సివిల్ ఐడి నెంబరు: .....
3) లింగం: పురుషుడు ☐ స్త్రీ ☐
4) నేషనాలిటీ..... వయసు..... భాష.....
5) ముస్లిం ☐ న్యూ ముస్లిం ☐ ముస్లిం న్యూ ముస్లిం బాలబాలికలు ☐
6) విద్యార్హత: ప్రాథమిక స్థాయి ☐ సెకండరీ ☐ హైసెకండరీ ☐ డిగ్రీ ☐
7) టెలిఫోన్: .....
8) గత ఏడాది పోటీలలో పాల్గొన్నారా? అవును ☐ లేదు ☐
9) ఒకవేళ పాల్గొని ఉంటే ఏ గ్రూపులో.....ఏ సంవత్సరంలో.....పాల్గొన్నారు.
10) ఏ గ్రూపులో పాల్గొనాలనుకుంటున్నారు .....
11) పారాల సంఖ్య: **1 2 3 4 5 6 7 8 9 10 11 12 13 14 15 16 17 18 19 20 21 22 23 24 25 26 27 28 29 30**

.....

12 సంవత్సరాల లోపు వయసు గలవారు

తండ్రి పేరు.....టెలిఫోన్:.....
పాల్గొనే వ్యక్తి పేరు..... లింగం: బాలుడు ☐ బాలిక ☐
వయసు.....సంతకం.....

Approved by

JUN 2012.indd 16 6/4/12 12:24 PM



ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

ముస్లిం జీవితానికి సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలు



ప్రశ్న: ప్రదర్శనాబుద్ధి (రియాకారీ) ఎన్ని రకాలు?

జ: నాలుగు రకాలు:1) పేరు ప్రతిష్ఠల కోసం చేయాలనే తలంపే సత్కర్మకు ప్రేరణగా నిలవటం.

2) దైవ ప్రసన్నత కోసం చేయాలన్న తలంపు, పేరు ప్రతిష్ఠల కోసం చేయాలన్న ఆలోచన ఇవి రెండూ ఏక కాలంలో ఉండటం. ఈ రెండు విరుద్ధ భావాలున్న మనిషి పాపాత్ముడవుతాడు. అతని ఈ సత్కర్మకు పుణ్యఫలం లభించదు, సరికదా అది త్రిప్పి కొట్టబడుతుంది.

3) ఒక మంచి పనిని కేవలం అల్లాహ్ మెప్పుకోసమే మొదలెట్టి మధ్యలో ప్రదర్శనా మనస్తత్వం జొరబడటం. ఇటువంటి పరిస్థితి లో మనిషి తన మనసులోని ప్రదర్శనా తత్వాన్ని దూరం చేసు కుంటే ఎలాంటి నష్టం జరగదు. కాని మనసులో ఆ కల్తీని పెట్టు కుని, ఫరవా లేదులే అనుకుంటే, అతని ఈ సత్కార్యం వ్యర్థ మయ్యే ప్రమాదముంది.

4) సత్కర్మ చేసేసిన మీదట ప్రదర్శనాభావం జనిస్తే అది ఒక దుష్ప్రేరణగా భావించబడుతుంది. దాని వల్ల మనిషి చేసే ఆరాధనకు నష్టముండదు. ఈ విధంగా ప్రదర్శనాబుద్ధి రహస్య ద్వారాలు ఎన్నో ఉన్నాయి. కాబట్టి వాటి పట్ల సావధానంగా ఉండటం మంచిది.

ప్రశ్న: కుఫ్ర్ (అవిశ్వాసం) ఎన్ని రకాలు?

జ: కుఫ్ర్ (అవిశ్వాసం, తిరస్కారం) రెండు రకాలు: 1) కుఫ్రె అక్బర్ 2) కుఫ్రె అస్గర్ 1) కుఫ్రె అక్బర్: ఇది మనిషిని ఇస్లాం పరిధి నుండి బయటికి గెంటివేస్తుంది. కుఫ్రె అక్బర్‌లో అయిదు రకాలు ఉన్నాయి.

1) ధిక్కారవైఖరితో కూడిన కుఫ్ర్

2) సత్యమని ధృవీకరిస్తూనే గర్విష్టిగా ప్రవర్తించే కుఫ్ర్.

3) సంశయంతో కూడుకున్న కుఫ్ర్

4) విముఖతా భావంతో కూడిన కుఫ్ర్

5) కపటత్వంతో కూడిన కుఫ్ర్.

2. కుఫ్రె అస్గర్:

దేవుడు చేసిన మేళ్ళను మించిపోవటం కూడా ఇందులో ఒకభాగమే. ఇది పాపానికి దారితీస్తుంది. దీనివల్ల మనిషి ఇస్లాం పరిధి నుండి తొలగిపోడు. ఉదాహరణకు: అకారణంగా సాటి ముస్లిం సోదరుణ్ణి చంపటం.

ప్రశ్న: మొక్కు కోవటం సబబేనా?

జ: మహాప్రవక్త (స) వారు మొక్కుకోవటం నుండి వారించారు. ఆయన (స) ఇలా అన్నారు: **"ఈ మొక్కుబడి ఎలాంటి మేలునూ తెచ్చిపెట్టదు"** (ముస్లిం)

ఏదైనా కేవలం అల్లాహ్ కోసం మొక్కుకుంటే ఫరవాలేదు. దైవేతరుల కోసం మొక్కుకుంటే ఉదాహరణకు సమాధి కోసమో, వలీ కోసమో మొక్కుకుంటే అట్టి మొక్కుబడి అధర్మం (హరామ్)

ప్రశ్న: చేతబడి సంగతేంటి?

జ: చేతబడి ఉంది అనేది సత్యం. అయితే అది ఎలా ఉంటుంది? దాని వాస్తవికత ఏమిటి? అనేది ఊహాత్మం. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

"అప్పుడు వారి త్రాళ్లు, వారి కర్రలు వారి మంత్ర శక్తిచే పరుగెత్తుతున్నట్లు అనిపించిందతనికి." (తాహా:66) దైవగ్రంథం, దైవప్రవక్త(స) సంప్రదాయం ద్వారా కూడా చేతబడి ఉంది అనే విషయం నిరూపితమవుతోంది. మరైతే చేతబడి, బాణామతి, క్షుద్ర విద్యను ప్రయోగించటం అధర్మం, నిషిద్ధం(హరామ్) ఇది చాలా పెద్ద పాపం. మహాపరాధం. మహాప్రవక్త(స) వారి ఈ హదీసు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది: **"సర్వనాశనం చేసే ఏడు పాపాల నుండి మిమ్మల్ని కాపాడుకోండి"** 'ఓ దైవప్రవక్తా (స)! సర్వనాశనం చేసివేసే ఆ ఏడు పాపాలు ఏవి? అని ప్రియ సహచరులు అడగగా ఆయన(స) ఇలా వివరించారు: **"అల్లాహ్‌తో పాటు వేరొకరికి భాగస్వామ్యం కల్పించటం, చేతబడి చేయటం ....."** (బుఖారి,ముస్లిం)

దివ్యఖుర్‌ఆన్‌లో ఒక చోట ఈ విధంగా అనబడింది: **"మేము ఒక పరీక్షపంటి వారం, నువ్వు మాత్రం అవిశ్వాసానికి పాల్పడకు".**

(అల్ బఖర:102)

ఈ నేపథ్యంలో కొన్ని నిరాధారమైన ఉల్లేఖనాలు మహాప్రవక్త (స) వైపు ఆపాదించ బడ్డాయి. ఉదాహరణకు: **"చేతబడి విద్య నేర్చు కోండి. కాని దాన్ని అమలు పరచకండి".**

హదీసులు సరైనవి కావు. పైగా అవి తప్పుడు రీతిలో మహా ప్రవక్త (స)కు అంట కట్టబడ్డాయి.

ప్రశ్న: జ్యోతిష్కులు, హస్త సాముద్రికులు, సోదిచెప్పే వారి వద్దకు వెళ్ళటం గురించి ఏమనబడింది?

జ: వారి వద్దకు వెళ్ళటం సమ్మతం కాదు. పైగా అది అధర్మం. ఎవరయితే వారి నుండి ప్రయోజనాన్ని ఆశించి, వారు చెప్పిన దానిని ధృవీకరించకపోతే 40 రోజుల వరకూ అతని నమాజ్ స్వీకరించబడదు. ఎందుకంటే మహనీయ ముహమ్మద్(స)వారు ఇలా వక్కాణించారు: **"ఎవరయినా ఒక జ్యోతిష్కుని వద్దకు వెళ్ళి, దేని గురించైనా అడిగితే 40 రాత్రుల వరకూ అతని నమాజ్ ఆమోదించబడదు".** (ముస్లిం)

ఆయన (స) ఈ విధంగా కూడా చెప్పారు: **"ఎవరయితే ఒక జ్యోతిష్కుని వద్దకో లేక ఒక సోదె చెప్పే వాని వద్దకో వచ్చి, అతను చెప్పిన దానిని సత్యమని ధృవీకరిస్తే, అతను ముహమ్మద్ (స)పై అవతరించిన షరీయతును (త్రోసిపుచ్చిన వాడవుతాడు".**

(అబూదావూద్)

JUN 2012.indd 17 6/4/12 12:24 PM



(గత సంచిక తరువాయి భాగం)

ఇస్లాం పీఠిక

స్త్రీలకు ఆస్తి హక్కు లభించినపుడే వారి అభ్యున్నతి సాధ్యమవుతుంది. వీమెన్స్ లిబరేషన్ మూమెంట్ నేతలు నేడు కనుగొన్న కొత్త విషయం ఇది. కాని ఇస్లాం ఏడవ శతాబ్దిలోనే స్త్రీలకు ఆస్తి హక్కు ఇచ్చింది. ఖుర్‌ఆన్ 4వ అధ్యాయంలో పురుషుల ఆస్తులపై స్త్రీల హక్కులు, ఆస్తి పంపిణి గురించి వివరాలు ఉన్నాయి. అంతే కాదు ఆస్తిలో ఎలాంటి హక్కులేని వారికి కూడా ఇవ్వమని పేర్కొన్న వాక్యం మిమ్మల్ని ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

"ఆస్తి పంపిణి జరుగుతున్నప్పుడు వారసులుకాని (నిరుపేద) బంధువులు అనాథలు, అగత్యపరులు ఎవరైనా వస్తే వారిక్కూడా ఎంతో కొంత ఇచ్చి పంపండి. వారితో మృదువుగా మాట్లాడండి."

(ఖుర్‌ఆన్-4:8)

యావత్ ప్రపంచంలో ఇస్లామీయ వ్యవస్థ ప్రకారం ఆస్తుల పంపకాలు జరిగితే సమాజంలోని నిమ్నోన్నతలను రూపు మాపే ఊహా జగత్తు నిజంగా మన కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది. అందుకే నెపోలియన్ తాను **'ఖుర్‌ఆన్ బోధనల ప్రకారం నడిచే సమాజాన్ని స్థాపించదలచి'**నట్లు ప్రకటించారు.

మేడమ్! ఓసారి మీరు నేడు పెళ్ళిళ్ళు జరుగుతున్న తీరు పట్ల ఆందోళన వెలిబుచ్చారు. ఇష్టం లేని పెళ్ళి జరిగిన స్త్రీల కన్నీటి వల్లనే సముద్రం ఉప్పగా మారిందని ఎవరో వ్యంగంగా అన్నారు. అయితే ఈ సందర్భంగా ఇస్లాం పురుషులకు చేసిన హెచ్చరిక గమనార్హమైనది.

"విశ్వాసులారా! బలవంతంగా స్త్రీల(ఆస్తి)కి వారసులై పోవడం మీకు ధర్మసమ్మతం కాదు." (ఖుర్‌ఆన్-4:19)

మేడమ్! ఓసారి మీరు భార్యల పట్ల పురుషుల ప్రవర్తన విషయమై బాధ వెలిబుచ్చారు. ముఖ్యంగా పురుషుడు తన భార్యను ఇష్టపడని పరిస్థితిలో. **'ఎ జెంటెల్‌మెన్ ఇజ్ఎ మ్యాన్ హు క్యాన్ డిస్‌అగ్రీ విథౌట్ బీయింగ్ డిస్‌అగ్రీబల్'** (తన మాటలు అనంగీకార యోగ్యమైనవిగా కనబడకుండా తన అనంగీకారాన్ని వ్యక్తపరచేవాడు పెద్ద మనిషి) కాని ఈ పెద్ద మనుషులు తమ భార్యల పట్ల అయిష్టత ఉన్నప్పుడు ఆగ్రహాన్ని ఆపుకోలేరు. సహనాన్ని చూపలేరు. ఇలాంటి పరిస్థితిలో మనిషికి మార్గం చూపే దైవాజ్ఞ ఏదైనా ఉందా అంటే ఖచ్చితంగా ఖుర్‌ఆన్‌లో ఉందని చెబుతాను నేను. మనిషి తన భార్య పట్ల అయిష్టత కల్గిన్నప్పుడు ఖుర్‌ఆన్ అతడ్ని హెచ్చరిస్తూ ఇలా పేర్కొన్నది:

"వారొకవేళ మీకు (ఒక విషయంలో) నచ్చకపోతే, నచ్చనిదాని లోనే దేవుడు మీకెంతో శ్రేయస్సు, మేలు పెట్టి ఉండవచ్చు."

(ఖుర్‌ఆన్-4:19)

మేడమ్! ఇదంతా చూసి మీరు ఆశ్చర్యపోవచ్చు. దేవుడు స్త్రీలకు మాత్రమే దేవుడా అని భావించవచ్చు. దేవుడు పురుషుడిని హెచ్చరిస్తూ అతను ఇష్టపడని భార్యలోనే అతనికి మేలు ఉండవచ్చని చెబుతున్నాడు.

చివరకు ఈ 20వ శతాబ్దిలోనూ పురుషుని అహం పాత కాలంలో మాదిరిగానే యధాతథంగా ఉంది. పురుషుని దృష్టిలో స్త్రీ ఆధార పడి బ్రతికే జీవి. అంతేగాని పరస్పరం ఒండొరులపై ఆధారపడి ఉన్నామని ఒప్పుకోడు. భార్య సంపాదిస్తున్నప్పటికీ ఇదే పరిస్థితి ఉంటుంది. పురుషుడు తన భార్య సంపాదనపై పూర్తి హక్కు తనకే ఉందనుకొంటాడు. అది తన స్వంత సంపదగా భావిస్తాడు. చివరకు కొందరు భార్యలు తాము సంపాదించిన సొమ్మును ఖర్చుపెట్టడానికి భర్తల అనుమతి తీసుకొనే పరిస్థితి ఉంది. ఖుర్‌ఆన్ స్త్రీ సంపాదన ఆమెదేనని స్పష్టంగా ఆదేశించింది.

"పురుషులు సంపాదించిన దానికి తగినట్లు వారి భాగం ఉంటుంది. స్త్రీలు సంపాదించిన దానికి తగినట్లుగా వారి భాగం ఉంటుంది." (4:32)

ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింద సూక్తి మీకు మరింత ఆసక్తి కలిగిస్తుంది.

"దేవుడు స్త్రీలపై పురుషులకు కొంత ఆధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపదను స్త్రీల కోసం ఖర్చు పెడ్తున్నందు వల్ల పురుషులు స్త్రీలపై వ్యవహారకర్తలు అవుతారు".

(ఖుర్‌ఆన్-4:3)

అంటే పురుషుడు కుటుంబనిర్వహణకు ఖర్చు చేయవలసి ఉంటుంది. కాగా, స్త్రీ సంపాదన ఆమె సొంతం. ఆమె దాన్ని తన కోసమైనా వాడుకోవచ్చు లేదా కుటుంబ ఖర్చుల కోసమైనా వాడవచ్చు. అది ఆమె యిష్టం.

మేడమ్! ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు సలహా, సిఫారసులు కావు. ఇవి ఆదేశాలు, ఉత్తర్వులు, తప్పించుకోవడానికి ఎలాంటి అవకాశం ఇవ్వని స్పష్టమైన ఆజ్ఞలు. ఈ ఆజ్ఞలకు కట్టుబడడం అన్నది దేవునిపై విశ్వాసంతో అనుసంధానం చేయబడింది. ఎందుకంటే ఖుర్‌ఆన్ దైవవాణి.

మనం ఇప్పుడు ఖుర్‌ఆన్‌లో పేర్కొన్న స్త్రీ పురుషుల సంబంధం చూద్దాం:

"ఆయన మీకోసం మీజాతి నుండే జీవిత భాగస్వామి(స్త్రీ)లను సృజించాడు, వారి దగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాలను కూడా జనింపజేశాడు. ఇది కూడా ఆయన సూచనల్లోనిదే. యోచించే వారికి ఇందులో అనేక నిదర్శనాలు ఉన్నాయి." (ఖుర్‌ఆన్-30:21)

పరస్పర అనురాగం, అనుబంధం, గౌరవాదరాలు, ఆప్యాయత అన్ని ప్రేమ, కారుణ్యాలతో ముడిపడి ఉన్నాయి. లైంగిస సంబంధం మాత్రమే కాదు. జీవితంలోని సమస్త రంగాల్లో స్త్రీ పురుషులు ఒకరిపైనొకరు ఆధారపడవలసిన భావన ఉంది ఈ సూక్తుల్లో.

స్త్రీపురుషులు ఒకరినొకరు దుస్తులవంటి వారని ఖుర్‌ఆన్ వర్ణించింది. **"వారు మీకు, మీరు వారికి దుస్తుల్లాంటి వారు."**

(ఖుర్‌ఆన్-2:187)

JUN 2012.indd 18 6/4/12 12:24 PM

"భార్యలు, కుటుంబసభ్యుల పట్ల మృదువుగా మెలగడమన్నది తప్పనిసరి విధి మాత్రమే కాదు, ఇది విశ్వాసంలోని ఒక భాగం" అన్నారు దైవప్రవక్త ముహమ్మద్(స).ఇంకా ఆయన ఇలా అన్నారు:

1. విశ్వాసులలో తమ కుటుంబాల పట్ల మృదువుగా, దయతో వ్యవహరించేవారు ఉత్తమ విశ్వాసాన్ని కలిగి ఉన్నవారు.
2. తమ భార్యల పట్ల దయతో మెలిగేవారే మీలో ఉత్తములు.
3. స్వర్గం తల్లి పాదాల చెంత ఉంది.

మేడమ్! మీరు నిరంతరం సత్యాన్వేషణకై పరితపించే జిజ్ఞాస గలవారని నా అభిప్రాయం. మీ తపనకు సమాధానమిచ్చే ఇస్లాం జ్ఞానంలోకి ప్రవేశించండి. ఈ తపనను చల్లారనీయకండి.

శ్రీమతి బ్లాసమ్‌కు రెండవ ఉత్తరం
శ్రీమతి బ్లాసమ్ గారికి,
మీకు శాంతి కలుగుగాక!

మీరు బాట్లగొండ చర్చిని సందర్శించి వచ్చారు. క్రీస్తు మీ సమస్యలను పరిష్కరించే శక్తి గలవాడని భావించి వెళ్ళారు. అంతేకాక మీరు అనేక ఇతర సమస్యల విషయమై కూడా మానసిక ప్రశాంతత కోరి వెళ్ళారు.

ఇస్లాం ప్రకారం జీసస్ దేవుడు కాదు, అన్ని సమస్యలు పరిష్కరించే దైవం కాదు. ఆయన దైవ ప్రవక్తలలో ఒకరు. ఆయన జీవిత కాలంలో దేవుని అభీష్టం ప్రకారం మహిమలు ప్రదర్శించారు.

దివ్యఖుర్‌ఆన్ జీసస్ గురించి తెలిపిన వివరాల ప్రకారం,**'ఆయన ఒక దైవదాసుడు తప్ప మరేమీ కాదు.' (43:57)**

శిశువు జీసస్ గురించి దివ్యఖుర్‌ఆన్ ఇలా పేర్కొంది: **'ఆ పిల్ల వాడు ఇలా మాట్లాడాడు: 'నేను అల్లాహ్ దాసుడ్ని. ఆయన నాకు దివ్యగ్రంథం ప్రసాదించాడు. ప్రవక్తగా నియమించాడు.'** (19:30)

'మర్యం కుమారుడు మసీహ్ దైవప్రవక్త తప్ప మరేమీ కాదు. అతనికి పూర్వం కూడా అనేకమంది దైవప్రవక్తలు వచ్చిపోయారు. అతని తల్లి సౌశీల్యమూర్తి అయిన స్త్రీ. వారిద్దరూ (అందరిలాగే) అన్నం తినే మనుషులే.' (5:75)

దేవునికి ఆకలి ఉండదు. దప్పిక వేయదు.**'దేవుడు గనక మర్యం కుమారుడు మసీహ్‌ని, అతని తల్లిని, భూలోకంలోని వారందర్నీ చంపదలచుకుంటే ఆయన నిర్ణయాన్ని అడ్డుకోగల ధైర్యం ఎవరికైనా ఉందా?'** (ఖురఆన్-5:17)

చివరకు జీసస్ కూడా క్రైస్తవులకు ఇలా హితోపదేశం చేశారు: **'దేవుడే నా ప్రభువు, మీ ప్రభువు కూడా. కనుక మీరు ఆయన్నే ఆరాధించండి. ఇదే సన్మార్గం.'** (ఖుర్‌ఆన్-43:64)

కాబట్టి శిశువు జీసస్‌గాని, ఆయన తల్లిగాని ముస్లిములైన స్త్రీపురుషులకు దేవుళ్ళు కారు, కాలేరు.

మీరు విశ్వాస సద్వచనం (కలిమా) పఠించదలిచితే ఇస్లామీయ ధార్మిక విశ్వాసానికి దృఢంగా కట్టుబడాలి. ధార్మిక విశ్వాసం కేవలం అల్లాహ్ మాత్రమే దేవుడు, రక్షకుడు అని ఇస్లాం బోధిస్తుంది. 'విశ్వసించిన వారికి అల్లాహ్ మాత్రమే కాపాడే స్నేహితుడు. ఆయన వారిని చీకట్ల నుంచి వెలుగులోకి నడిపిస్తాడు.' (2:57) **'అల్లాహ్ మాత్రమే ఏకైక రక్షకుడు.'** (42:9)

మీరు ఏమాత్రం సంకోచించకండి, భయపడకండి, ధైర్యంగా నిర్ణయం తీసుకొండి. అధైర్యాన్ని మించి మనిషిని కబళించేది మరేదీ లేదు. ధైర్యంగా పని చేసే వారిదే విజయం. 'భయం అన్నది ఎల్లప్పుడు అజ్ఞానం నుంచి పుడుతుంది.' కాబట్టి అజ్ఞాన చికట్లను వదలి జ్ఞానం (ఇస్లాం) అనే వెలుగు వెన్నెల్లో తడి స్నానాలు చేయండి.



'మిమ్మల్ని అన్ని బాధల నుంచి కాపాడేవాడు అల్లాహ్‌యే." (6:64)

"అల్లాహ్ మాత్రమే సంరక్షకుడు, సహాయకుడు."(22:78)

మేడమ్! మీరు మీ సమస్యలకు పరిష్కారం, శాశ్వత సాఫల్యం కోరుతుంటే అల్లాహ్‌ను మాత్రమే తగిన పరిశుద్ధత (వుజూ)తో ఆరాధించండి.

"అల్లాహ్ కోరితే ఆయన తన అనుగ్రహంతో మిమ్మల్ని సంపన్నులు చేయడం అసంభవం కాదు." (9:28)

కాబట్టి అల్లాహ్‌ను ఆరాధించడం ద్వారా ఆయన ప్రసాదించే సంపద పొందమని నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నాను మీతో నా పరిచయమంతా ఇదే అంశంపై కేంద్రీకృతమై ఉంది. నేను చాలా కాలంగా దీని కోసమే ఎదురు చూస్తున్నాను.

మీరు ఏమాత్రం సంకోచించకండి, భయపడకండి, ధైర్యంగా నిర్ణయం తీసుకొండి. అధైర్యాన్ని మించి మనిషిని కబళించేది మరేదీ లేదు. ధైర్యంగా పనిచేసే వారిదే విజయం. 'బియర్స్' తన పుస్తకం 'డెవిల్స్ డిక్షనరీ'లో చెప్పినట్లు **'ప్రమాదకరమైన ప్రయాణంలో ఉన్నవాడు కాళ్లతో ఆలోచిస్తాడు.'**

ధైర్యం అన్నది మనస్సు, శరీరానికి రెంటికీ సంబంధించినది. ఎమర్సన్ చెప్పినట్లు 'భయం అన్నది ఎల్లప్పుడు అజ్ఞానం నుంచి పుడుతుంది.'

మేడమ్! మీరు జ్ఞానం కలిగిన మహిళ. మీరు మీ జ్ఞాన సంపదను ఉపయోగించండి. ఆచరణలో పెట్టిన జ్ఞానం, ఆచరణలో లేని జ్ఞానంకంటే ఎంతో శక్తిమంతమైనది.

అల్లాహ్ పట్ల విశ్వాసముంచండి. ఆయన విశ్వసించినవారిని, సత్కార్యాలు చేసేవారిని కాపాడుతాడు. వారికి తప్పనిసరిగా లభించే ప్రతిఫలం ఉంది.

మద్రాస్ భవదీయుడు, 19-8-1990 అబ్దుల్లా అడియార్

JUN 2012.indd 19 6/4/12 12:25 PM



మాట - మౌనం

-అబుల్ హసన్

ప్రకృతితో పోరాడని చెట్టు, మరిన్ని ప్రభాకాంతుల కోసం విస్తరించని చెట్టు, కేవలం వర్షం నీటితో సంతృప్తి పడే చెట్టు అడవికి రారాజు ఎప్పటికీ కాలే నట్టు. గాలికెదురుగా నిల్చిన చెట్టు, నీటి కోసం వేళ్ళతో భూమిని చీల్చిన చెట్టు, నక్షత్రాల ఆవల లోకాన్ని చూడాలన్న ఆరాటంతో నింగికెగి సిన చెట్టు, మని షెలా, మనమెలా బ్రతకాలో మనకి మౌనంగానే పాఠం చెప్పినట్టు.

"అల్లాహ్ పరిశుద్ధ వచనాన్ని దేంతో పోల్చాడో మీరు గమనించ లేదా? అది ఒక పరిశుద్ధ వృక్షం వంటిది. అది బాగా వ్రేళ్లూనుకుని ఉంది. దాని శాఖలు ఆకాశంలో ఉన్నాయి. తన ప్రభువు ఆజ్ఞతో అది ఎల్లప్పుడూ పండ్లను ఇస్తోంది. ప్రజలు గుణపాఠం నేర్చుకునేందుకు అల్లాహ్ వారి ముందు ఈ ఉపమానాలను వివరిస్తున్నాడు. (దీనికి భిన్నంగా) అశుద్ధ వచనం ఉపమానం అశుద్ధ వృక్షం వంటిది. అది నేల ఉపరితలంపై నుంచే పెకలించి వేయబడింది. దానికి స్థిరత్వం అనేదే లేదు". (దివ్యఖుర్ఆన్-14: 24-26)

మౌనం – సహనంలో మౌనం, ధైర్యంలో మౌనం, దైన్యంలో మౌనం, ధ్యానంలో మౌనం, పోరాటంలో మౌనం మన ఆధ్యాత్మిక పరిపక్వతకు ప్రతిబింబం. **'నా మౌనం పరిశీలన అవ్వాలి', 'అల్లాహ్‌ను అంతిమ దినాన్ని విశ్వసించిన వ్యక్తి పలికితే మంచి మాటే పలకాలి లేదా మౌనం వహించాలి', 'మనిషి నిష్ప్రయోజనకరమైన విషయాలను విడిచి పెట్టడం అతని ఉత్తమ విశ్వాసానికి, విధేయతకు నిలువెత్తు నిదర్శనం'** అని అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) అన్నారంటే అది కొన్ని వేళల్లో మాటకంటే మౌనం విశిష్ఠతను ఎరుక పర్చేందుకే.

మనిషి తన మనోభావాల్ని మాట ద్వారా వ్యక్త పరచినట్లే మౌనం ద్వారా కూడా వ్యక్తపరచగలడు. మాట మన ఆంతర్యానికి అద్దం పడితే, మౌనం మన వ్యక్తిత్వ బలానికి దృఢమైన సూచన. మాట మన వాక్చాతుర్యానికి, పండిత ప్రకర్షకు ఆలంబనం అయితే, మౌనం మనలోని నమ్మకానికి, నిండుతనానికి, సంకల్ప దీక్షకు, లక్ష్యశుద్ధికి నిలువెత్తు నిదర్శనం. కొన్ని సందర్భాల్లో 'మౌనం' పిరికితనానికి, ఎసెకిసిస్టు స్వభావానికి ఆనవాలవుతుంది అన్న మాట నిజమే కావచ్చు కానీ; కొన్ని వేళలల్లో మాటకన్నా మౌనమే బలమైన సమాధానం కాగలదు. కొన్ని ప్రత్యేక స్థలాల్లో, సందర్భాల్లోనయితే మౌనం ఒక గౌరవ సూచకం. కొన్ని సమ యాల్లో వాక్ప్రదర్శనకన్నా అస్ప్రసన్యాసమే మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే కారకం అవుతుంది. కాబట్టి అల్లాహ్‌చే ఉనికిలోకి వచ్చిన విశ్వ వ్యవస్థ గురించి యోచించమని చెప్పిన ప్రవక్త (స) వారే అల్లాహ్ అస్తిత్వం గురించి ఊహాగానాలు చేయకండి అని హెచ్చరిస్తూ ఆయన ఇలా అన్నారు: **"మీలో ఒకని వద్దకు షైతాన్ వచ్చి ఫలానా దాన్ని, ఫలానా దాన్ని ఎవరు సృష్టించారు? అని ప్రశ్నిస్తాడు. (అల్లాహ్, అల్లాహ్ అని మీరు సమాధానమిస్తూ పోతే) చివరికి నీ ప్రభువును పుట్టించిందెవరు? అని అంటాడు. ఈ స్థితి మీలో ఎవరికయినా ఎదురయితే వారు అట్టి పాడు ఆలోచనల నుండి అల్లాహ్ శరణు వేడుకుని అంతటితో ఆగి పోవాలి, మౌనం వహించాలి".** (బుఖారీ)

యదార్థ జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే ఉంది.

మౌనాన్ని మహాస్త్రంగా ఉపయోగించిన వారిలో మామూలు మానవులే కాదు మహా మహితాత్ములయిన ప్రవక్తలు కూడా ఉన్నారు. మనిషి ఎంతటి మహాత్ముడయినా అతనికున్న జ్ఞానం పరిమితమయినది. దైవ సృష్టిలో దాగి ఉన్న నిగూఢాంశాలు కొన్ని కాలక్రమేణా అర్థమయినా కొన్ని మాత్రం మానవ మేధకు అందకపోవచ్చు. అందుకే ప్రవక్త మూసా (అ) హజ్రత్ ఖజర్ (అ)తో **'మీకు నేర్పిన మంచి జ్ఞానాన్ని మీరు నాకు నేర్పడానికి మీ వెంట ఉండవచ్చా?'** అని అభ్యర్థించినప్పుడు ఆయన (ఖిజర్) 'మీరు నా సహచర్యంలో ఉంటూ ఏ మాత్రం ఒపిక పట్టలేరు. అయినా మీ జ్ఞాన పరిధిలోకి తీసుకోని విషయంపై ఓపిక పట్టడం మీవల్ల ఎలా సాధ్యమవుతుంది?' అని తిరిగి ప్రశ్నించగా **'అల్లాహ్ చిత్తమయితే మీరు నన్ను సహనశీలిగా పొందుతారు. ఏ విషయంలోనూ నేను మీ ఆజ్ఞను జవదాటను, మౌనంగానే ఉంటాను'** అని ముసా (అ) సవినయంగా మనవి చేసుకున్నారు.

(దివ్యఖుర్ఆన్-18: 66-69)

ప్రవక్త ఈసా (అ) వారి తల్లి మర్యమ్ (అ) అల్లాహ్ ఆదేశం మేరకు కొంత కాలం మౌన వ్రతం పాటించారు. (అయితే ఇస్లాం లో మౌన వ్రతానికి అనుమతి లేదు). ప్రవక్త జకరియా (అ) దైవాదేశానికి కట్టుబడి కొన్ని రోజులు మౌనంగా ఉంటూనే అల్లాహ్ ఘనకీర్తిని మనసుతో స్తుతించారు. ప్రవక్త ఈసా (అ) కొన్ని వేళల్లో మౌనం పాటించారు. దైవ అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) అనేక సమస్యల పరిష్కార్థం సహచరులు వచ్చి ఆయన్ను సంప్రదించినప్పుడు దైవవాణి అవతరించేంత వరకు మౌనం వహించారు. అలాగే ఇఫ్క్ సంఘటనలో సయితం ఆయన మౌనమూర్తి అయి ఉండటం మనం గమనిస్తాము. కాబట్టి ఖుర్ఆన్‌లో మనకు రెండు విధాల ఆయతులు కనబడ తాయి. ముహ్కమాత్ మరియు ముతషాబిహాత్. ముహ్కమాత్ అంటే పండితుని నుంచి మొదలు పామరుని వరకూ అందరికీ అర్థమయ్యే ఆయతులు. ముతషాబిహాత్ అంటే అందరి మేధకు అందనివి. వీటి విషయంలో సరైన జ్ఞానం మనకు అందనంత వరకూ మనం మౌనంగా ఉండటమే మనకు అన్ని విధాలా శ్రేయోదాయకం.

JUN 2012.indd 20 6/4/12 12:25 PM

కనకనే అల్లాహ్ ఖుర్‌ఆన్ పారాయణ సమయంలో మౌనంగా ఉండమని ఆదేశిస్తున్నాడు: **'ఖుర్‌ఆన్ పారాయణం జరుగుతున్నప్పుడు దానిని శ్రద్ధగా వినండి, నిశ్శబ్దం (మౌనంగ)గా ఉండండి. తద్వారా మీరు కరుణించబడవచ్చు".** (అల్ అరాఫ్: 204)

మనం సద్విమర్శ విలువ తెలిసినవారమయితే, 'విమర్శ అవసరమా?, అవతలి వ్యక్తి సహృదయంతో స్వీకరించి, సానుకూలంగా స్పందించే అవకాశం, వాతావరణం ఉందా?, ఇది సరయిన సమయమా?, విమర్శించేందుకు మనం తగిన వారమేనా? -అని ఆలోచించి మరీ విమర్శించాలి

మాటే ముత్యం, మాటే మహోపద్రవం

ఒకవేళ మాట్లాడటమే అనివార్యమనుకుంటే, జాగ్రత్త! అక్కరకు రాని విషయాల వెనుక పడి మీ శక్తియుక్తులను దుర్వినియోగం చేసుకోకండి. **'మనిషి నోట ఒక మాట వెలువడటమే ఆలస్యం. అతని దగ్గర ఒక పర్యవేక్షకుడు (దాన్ని నమోదు చేయడానికి సిద్ధంగా) ఉంటాడు'.** (ఖాఫ్:18) అన్న విషయం గర్తుంచుకోవాలి. రేపు అల్లాహ్ సన్నిధిలో పలికి ప్రతి పలుకుకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని మరువకూడదు. మాట వెండి అయితే, మౌనం బంగారం అన్నారు పెద్దలు. మాట ముత్యమే కాదు అప్పుడప్పుడు మహోప్రదవం కూడా అవుతుంది. కనుక మాట్లాడక ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకొని మాట్లాడాలి. నువ్వు విన్నావా అని చెవిని, నువ్వు కన్నావా అని కంటిని, నువ్వు తెలుసుకున్నావా అని గుండెని నిలదీసి అడిగే రోజు ఒకటుందన్న సత్యాన్ని విస్మరించకూడదు.

మనం కాలం విలువ, గమ్యం విలువ తెలిసివారమయితే, అది తెలియని వ్యక్తులు ఎలాగయితే తమకు ఏ మాత్రం సంబంధం లేని విషయాల గురించి ఎంతో చర్చిస్తూ, సమయాన్ని వృధా చేసి తరువాత మర్చిపోయినట్లు మనం చేయకూడదు.

మనం దాంపత్య జీవితం విలువ తెలిసినవారమయితే, సంతోష, సుఖ సంసారానికి మొదటి సూత్రం **'తప్పు నీదయితే ఒప్పుకో, తప్పు అవతలి వారిదయినప్పుడు మాట్లాడకు, మౌనంగా ఉండి వినంతే'** అన్నది.

మనం సద్విమర్శ విలువ తెలిసినవారమయితే, 'విమర్శ అవసరమా?, అవతలి వ్యక్తి సహృదయంతో స్వీకరించి, సానుకూలంగా స్పందించే అవకాశం, వాతావరణం ఉందా?, ఇది సరయిన సమయమా?, విమర్శించేందుకు మనం తగిన వారమేనా?అని ఆలోచించి విమర్శించాలి.

మనం జ్ఞానాన్ని, జ్ఞానుల్ని, ప్రజ్ఞతను, స్థితప్రజ్ఞతను ఇష్టపడే వారమయితే – **'జ్ఞానులు, స్థితప్రజ్ఞులు అవసరం వచ్చినప్పుడు మాత్రమే మాట్లాడుతారు. అజ్ఞానులు అవసరం కల్పించుకుని మరీ మాట్లాడతారు'** అని తెలుసుకోవాలి. **'అభ్యాసము వలన వచ్చేది జ్ఞానము. జ్ఞానము వలన వచ్చేది ధైర్యము, మౌనము = ధీరశాంతము. మౌనము, శాంతము వలన వచ్చేది ధ్యానము. ధ్యానము వలన వచ్చేది త్యాగము. త్యాగము వలన కలిగేది మోక్షము'** అన్నది వెనకటి మేదావుల మాట. అలాగే నిండుజ్ఞానం గల వ్యక్తి చిరునవ్వులతో సదా నిశ్చలంగా ఉంటాడు. జ్ఞానం కొరవడిన వ్యక్తి ఎప్పుడూ చిటపటలాడుతూ ఉంటాడు.

మనం ప్రతిభను, నైపుణ్యాన్ని ఇష్టపడేవారమయితే, **'నైపుణ్యం'** లేని వ్యక్తులు ఎక్కువగా మాట్లాడుతారు. కేవలం మనల్ని ఇంప్రెస్ చేయడానికే ఆ మాటలు ఉపయోగపడతాయి తప్ప, జీవితంలో పైకి రావడానికి కాదు. వారు సమయాన్ని సామర్థ్యాన్ని మాటల్తో వృధా చేస్తారు. సినిమా నుంచి మొదలు సీమ కబుర్ల వరకు, ప్రాంతీయ సమస్యల నుంచి మొదలు అంతర్జాతీయ రాజకీయాల దాకా మాట్లాడటానికి నైపుణ్యరహితుల దగ్గర చాలా సబ్జెక్టు ఉంటుంది. వారికి సయితం ఏ విధంగా పనికి రాని సమాచారాన్నంతా మనకి పంచాలనే కోరిక కూడా బలంగానే ఉంటుంది. నైపుణ్యం గలవారు అలా కారు. ఖచ్చితంగా మనకేది కావాలో అదే కరెక్ట్‌గా ఇస్తారు. సమయం వృధా చేయరు.

మన మాటలే మన ఆంతర్యానికి అద్దాలు. **'గిన్నె లోపలిదే నిండిన మీదట బయటికి వస్తుంది'** అన్నట్టు – మన మాట తీరే మనో స్థితిని బహిర్గతం చేస్తుంది. మాటలే మనుషుల్ని కలుపుతాయి, మమతల్ని పంచుతాయి. మాటలే మనసుల్ని విడగొడతాయి, మన కాపురాల్లో కలతలు రేపుతాయి. అద్దం విరిగితే అతికించుకోవచ్చు. కానీ, హృదయం ముక్కలయితే మందు లేదు. కాబట్టి మాట జారకూడదు, మాటల తూటాలతో మన సుల్ని గాయ పర్చకూడదు. **'చాలా మందిని వారి మాటలే సమాధికి చేరుస్తాయి (వారి చావుకి కారణం అవుతాయి).'** అన్నది ప్రాచీన నానుడి.

నిజంగా మాట విలువ అనంతమయినది. అగాధమయినది. అనిర్వచనీయమయినది. మనస్సుకు మాటకు మధ్య అవినాభావ సంబంధ బాంధవ్యం ఉంది. మాట మమతను పెంచుతుంది. మాట కరుణామృతాల్ని పంచుతుంది. మాట ప్రేమ పారిజాతాల్ని పూయిస్తుంది. మాట అనురాగ వాత్సల్యాన్ని కురిపిస్తుంది; అది మంచిదయితే. విజ్ఞాన వసంతాల్లో విహరించేలా చేసిన అనేక మంది విద్యావంతులు **'మంచి మాట'**తో స్ఫూర్తి పొందే ఘనకీర్తి గడించారు. విజయశ్రీ అనే వృక్షానికి మాట వేరు లాంటిది. మాట ఎంత మధురంగా ఉంటే మమత అంతే దట్టంగా ఉంటుంది. ప్రతిభ అంతే ప్రగాఢంగా అభివృద్ధి చెందుతుంది. ఇమామ్ బుకారీ (ర) గారిని చూసి ఆయన గురువు **'నీలో హదీసు సంకలనకర్త కాగలిగే లక్షణాలు కనబడుతున్నాయి'** అన్నారు. ఆయన తర్వాత అదే మాట స్ఫూర్తితో హదీసువేత్త అయ్యారు.

అలాగే వ్యాపారం చేసుకునే అబూ హనీఫా (ర) గారిని చూసి ఆయన గురువు **'నువ్వు గొప్ప పండితుడివి కాగలవు'** అన్నారు. అదే మాట ప్రేరణతో ఆయన గొప్ప ఇమామ్ అయ్యారు. ఇటువంటి సంఘటనలు అనేకం మనకు కనబడతాయి. మన నోటి నుండి వెలువడే ఒక మాట, ఒక ప్రోత్సాహం ఇతరుల పాలిట మహదానుగ్రహంగా మారే అవకాశమూ ఉంది, శాపంగా పరిణమించే ప్రమాదమూ ఉంది. మంచి మాట మనసు నొప్పించే దానం కన్నా గొప్పది అంటుంది ఖుర్‌ఆన్: **"దానం, చేసిన తర్వాత మనసు నొప్పించడం కంటే మంచి మాట పలకడం, మన్నించడం ఎంతో మేలు".** (బఖర:263) కాబట్టి మన మాట స్ఫూర్తి అయ్యేలా, మన మౌనం ధ్యానం పరిశీలన అయ్యేలా మన ప్రవర్తనను మనం తీర్చిదిద్దుకోవాలి.

JUN 2012.indd 21 6/4/12 12:25 PM

ఉర్దూ సంకలనం
ముహమ్మద్ అన్వర్ సలఫీ



సమాజానికి పట్టిన చీడ వడ్డీ పీడ

వడ్డీ: కొన్ని రకాలు

ఒక వస్తువును మరొక వస్తువుకు బదులుగా ఎక్కువగా ఇచ్చి అమ్మటాన్ని వడ్డీ అంటారు. ధర్మవేత్తలు దాని గురించి ఇలా చెప్పారు: **"తిండి పదార్థాలు, బరువు మరియు కొలత ఈ మూడింటిలోని ఏ రెండు గుణాలున్నా వీటిలో ఒక దానికి బదులు మరొకదాన్ని ఎక్కువగా ఇచ్చిపుచ్చుకోవటం ధర్మం కాదు. ఏ వస్తువులలోనయినా ఈ మూడు గుణాలు లేనప్పుడు లేదా వాటి రకం మారిపోయినప్పుడు వాటిలో హెచ్చు తగ్గులు అయిన ప్పుడు అది వడ్డీ అనబడదు".**

హజ్రత్ ఉబాద బిన్ సామిత్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: **'బంగారానికి బదులు బంగారం, వెండికి బదులు వెండి, గోధుమలకు బదులు గోధుమలు, బార్లీకి బదులు బార్లీ, ఖర్జూరపు పండ్లకు బదులు ఖర్జూర పండ్లు సరి సమానంగా అమ్మటం ధర్మ సమ్మతమే కాని వీటిలో దేన్నయినా తక్కువ ఎక్కువలు చేస్తే అది వడ్డీ అవుతుంది'.** (ముస్లిం, అహ్మద్)

తెలిసిందేమిటంటే ఏ వస్తువు ఎంత ఇస్తే అంతే తిరిగి తీసుకో వాలి, ఎంత బంగారం, ఎంత వెండి, ఎంత డబ్బు ఇస్తే అంతే తిరిగి తీసుకోవాలి, అసలు (ధనం)పైన ఎక్కువ తీసుకోవటం అది చిన్న మొత్తమయినా లేదా పెద్ద మొత్తమయినా వడ్డీ అవుతుంది.

మారు వడ్డీ: అనగా ప్రజలు ధనవంతుల దగ్గర బాకీ తీసుకుని, ఎక్కువ వడ్డీకి ఇతరులకిచ్చి, వారిచ్చిన ధనంపైన ప్రతి నెల కొంచెం ప్రత్యేక సొమ్ముని వడ్డీ రూపంలో చెల్లిస్తారు.

బ్యాంకు వడ్డీ: కొంత మంది వ్యాపారం, వ్యవసాయం కొరకు బ్యాంకుల నుండి రుణం తీసుకొని నిర్ణీత కాలంలో నిర్ణీత సొమ్ము ను వడ్డీ రూపంలో చెల్లిస్తారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్: కొంత మంది డబ్బుని వడ్డీ చెల్లించే బ్యాంకులలో నిర్ణీత కాలం (5 లేదా 10 సం) వరకు డిపాజిట్ చేస్తారు. వారిని బ్యాంకు 12% లేదా 15% వడ్డీ ఇస్తుంది. ఆ గడువు పూర్తి అయ్యేసరికి వారి సొమ్ము రెట్టింపు అయి రెండింతలు మూడింతలు అవుతుంది. ఎక్కువ వచ్చిన డబ్బు వడ్డీ అవుతుంది.

ఒకవేళ ఎవరయినా తన సొమ్మును ఇస్లామీయ బ్యాంకులలో లేదా వడ్డీ లేని బ్యాంకు లలో డిపాజిట్ చేస్తే, బ్యాంకు అతనికి లాభనష్టాలలో భాగస్వామిగా చేసుకొని అతనికి తక్కువ ఎక్కువ సొమ్మును చెల్లిస్తే మటుకు అది వడ్డిగా భావించబడదు.

లైఫ్‌ఇన్సూరెన్స్ (జీవిత భీమా పథకం): ఒకంపెనీ నమ్మకస్తుడైన డాక్టర్ ద్వారా వినియోగదారుని ఆరోగ్యాన్ని పరిశీలించి, ఆవ్యక్తి ఆరోగ్య ప్రకారం 20 సంవత్స రాలు జీవించగలడని రిపోర్ట్ ఇస్తే, కంపెనీ ఆ వ్యక్తితో 10 లేదా 15 సంవత్సరాల ఒప్పందం చేసుకుంటుంది. ఉదాహరణకు ఆ వ్యక్తి 10 లక్షలు 10 సంవత్సరాలలో నెలనెలా చెల్లించాలి. పది సంవత్సరాల గడువు పూర్తయిన పిదప కంపెనీ ఆ వ్యక్తికి 25 లక్షలు చెల్లిస్తుంది. ఒకవేళ రెండు సంవత్సరాలలోనే ఆవ్యక్తి మరణిస్తే కంపెనీ ఆ వ్యక్తి వారసుల్ని 25 లక్షలు తప్పనిసరిగా చెల్లించాల్సి వస్తుంది. ఒకవేళ ఇన్సూరెన్స్ కట్టే వ్యక్తి రెండుమూడు సంవత్సరాలు చెల్లించి మానేస్తే కంపెనీ అతనికి ఒక రూపాయి కూడా చెల్లించదు, జమ చేసిన మొత్తం సొమ్ము వృధా అవుతుంది. ఈ విధంగా లైఫ్‌ఇన్సూరెన్స్‌లో అనేక లోపాలున్నాయి. కాబట్టి క్రింద ఇవ్వబడిన కారణాల దృష్ట్యా మెజారిటీ విద్వాంసులు ఇది అధర్మం అని ఫత్వా జారీ చేశారు. 1) అల్లాహ్ పట్ల నమ్మకానికి విరుద్ధం. 2) ఒక్కొక్కసారి కంపెనీకి నష్టం వాటిల్లుతుంది. ఒక్కోసారి వినియోగదారుడు నష్టపోతాడు. ఇస్లాంలో స్వతహాగా నష్టపోవడం, వేరేవారిని నష్టపరచడం రెండూ సమ్మతం కాదు. 3) కొన్ని సార్లు వారసుల హృదయాల లో ధనవ్యామోహం పెరిగి, ఇన్సూరెన్స్ కట్టే వ్యక్తి హత్యకు కార కులు అవుతారు.

తాకట్టుగా ఉన్న వస్తువులను వాడటం: పేదవాని ఇల్లు, వగైరాను తాకట్టుగా పెట్టుకొని అతనికి కొంత డబ్బు అప్పుగా ఇచ్చి (అప్పు చెల్లించే వరకు) ఆ ఇల్లుని తనే స్వయంగా ఎలాంటి బాడుగ చెల్లించకుండా ఉంటాడు లేదా ఆ ఇంటిని వేరే వారికి అద్దెకిచ్చి వచ్చే ఆదాయాన్ని ఆర్జిస్తాడు. ఇలాంటి వ్యాపా రంలో సామాన్యులే కాకుండా ధర్మజ్ఞానం కలిగి ఉన్నవారు కూడా చాలామంది ఉన్నారు. ఇది కూడా వడ్డీ రకాలలో ఒక రకమే.

చీటీపాటల వడ్డీ: సమాజంలో వ్యాపించి ఉన్న వడ్డీ విధానాల లో ఒక విధానం ఏమిటంటే పదిమంది కలిసి ప్రతి ఒక్కరు ప్రతి నెల పది వేల రూపాయలు చొప్పున జమ చేసి జమ అయిన మొత్తం లక్ష రూపాయిలు వేలం పాట పాడబడుతుంది. ఒకరు 90 వేలకి, మరొకడు 80 వేలకి లేదా 70 వేలకి తీసుకుం టాడు. చివరకు అందరికంటే తక్కువ మొత్తం మీద ఎవరు తీసు కుంటారో అతనికి ఆ డబ్బు ఇస్తారు. మిగిలిన 30 లేదా 40 వేలు అందరూ కలిసి పంచుకుంటారు. కాని డబ్బు తీసుకున్న వ్యక్తి మొత్తం లక్ష రూపాయిలు చెల్లించాల్సిందే. ఈ విధానాన్ని కొందరు కమీటీ అనీ కొందరు చీటి అని పిలుచుకుంటారు. ఇది కూడా వడ్డీ విధానాలలో ఒక విధానమే. ఇవి కాక వడ్డీ విధా నాలు ఇంకా చాలా ఉన్నాయి.

JUN 2012.indd 22 6/4/12 12:25 PM

తెలుగు అనువాదం
షేఖ్ హబీబుర్రహ్మాన్

బ్యాంకులతో లావాదేవీలు

నేడు ప్రతి వ్యక్తికి ఏదో ఒక రూపంలో ఏదో ఒక విధంగా బ్యాంకులతో సంబంధం తప్పనిసరిగా ఉంటుంది. ముఖ్యంగా బ్రతుకు తెరువు కోసం విదేశాలకు వచ్చినవారికి. డబ్బులు పంపించాలంటే బ్యాంకులపై ఆధారపడటం తప్పనిసరి. ఎందు కంటే బ్యాంకుల ద్వారా కాకుండా వేరే విధానాన్ని పాటిస్తే అది చట్ట విరుద్ధమవుతుంది. ఇంకా ఆ డబ్బు చేరే వరకు నమ్మకముం డదు. నమ్మకమున్నా ఇల్లువగైరాలు కొన్నప్పుడు ఇన్‌కమ్‌టాక్స్ వారు వివరణ కోరినప్పుడు మన దగ్గర సమాధానముండదు. కాబట్టి ఇటువంటి పరిస్థితులలో బ్యాంకుల ద్వారా డబ్బులు పంపేందుకు ధర్మవేత్తలు అనుమతినిచ్చారు. షేఖుల్ ఇస్లాం అల్లామహ్ అబ్దుల్ అజీజ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ బాజ్ (ర) ఇలా అన్నారు: **'నేటి కాలంలో బ్యాంకుల ద్వారా డబ్బుల్ని పంపించటం అత్యవసరాలలో ఒక అవసరం. అలాగే వడ్డీ షరతు లేకుండా కేవలం భద్రత కోసం డబ్బుల్ని బ్యాంక్‌లో ఉంచటమూ సమ్మ తమే'.** (ఫతావా ఇస్లామీయ :2/525)

అలాగే ఎవరయినా బ్యాంకులో కరెంట్ అకౌంట్ తెరవటం కూడా (వడ్డీలేనప్పుడు) సమ్మతమే.

దిక్కు తోచని స్థితిలో...

దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: **"మానవులపై ఒక కాలం వస్తుంది. అప్పుడు ప్రతి ఒక్కడు వడ్డీ తింటాడు. ఒక వేళ వడ్డీ తినకుంటే కనీసం వడ్డీ దులారమైనా అతనికి తగిలి తీరుతుంది".** (నసాయి)

ఈ రోజుల్లో ముస్లిముల పరిస్థితి ఇలాగే ఉంది. యావత్ ప్రపం చంలో, అలాగే ముస్లిములలో కూడా వడ్డీ ఎలా ప్రబలిపోయిం దంటే ప్రతి ఒక్కరూ తమకు తెలియకుండానే వడ్డీ ఊబిలో కూరుకు పోతున్నాడు. ఒక ముస్లిం పూర్తిగా వడ్డీ నుండి దూరం గా ఉండాలని కోరుకున్నా ఎన్నో చోట్ల అతనికి ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. ఉదహరణకు: ఈ రోజుల్లో ఎవరన్నా కారు, బస్సు, లేదా ఏదైనా వాహనం కొనాలనుకుంటే అతను తప్ప కుండా ఇన్సూరెన్స్ చేయించాల్సి వస్తుంది. అలాగే వ్యాపారం చేసే వారికి బ్యాంకు నుండి సంబంధం లేకుంటే మరియు బ్యాంకు నుండి ఎల్.సీ (L.C) నమ్మక పత్రం లేకపోతే వారు ఎలాంటి సామగ్రిని ఇచ్చిపుచ్చుకోలేరు. ఇలాంటి పరిస్థితులలో ఇటువంటి వడ్డీ విధానాలను అంతం చేసి వాటికి బదులుగా వేరే విధానాల ను ప్రవేశ పెట్టడం ఇస్లామీయ రాజ్యాల పని. గవర్నమెంటు ఈ పని చేయకపోతే ప్రతి ముస్లిం శాయశక్తులా వడ్డీ నుండి దూరం ఉండాలి. తప్పనిసరి పరిస్థితులలో అల్లాహ్ క్షమిస్తాడు.(ఇన్ షాఅల్లాహ్) షరీఅత్‌లో ఒక నియమం ఏమంటే మానవునికి అధికారంలో ఉన్నవాటిపై మాత్రమే ప్రశ్నించడం జరుగుతుంది. తన స్వాధీనంలో లేని వాటిపై ప్రశ్నించబడదు. (ఇన్‌షాఅల్లాహ్)

షేర్ మార్కెట్

ప్రస్తుత కాలం షేర్‌మార్కెటింగ్ కాలం, కంపెనీలు కంపెనీ భాగాల్ని (షేర్స్)అమ్ముతాయి. ఎవరయితే కంపెనీ షేర్స్ కొంటారో వారు కంపెనీకి షేర్‌హోల్డర్ అవుతారు. సంవత్సరంలో ఒకసారి లాభనష్టాలు కంపెనీ షేర్‌హోల్డర్ల మధ్య పంచుతుంది. కంపెనీ లాభంలో ఉంటే షేర్ విలువ పెరుగుతుంది. నష్టంలో ఉంటే షేర్ విలువ తగ్గుతుంది. ఒక్కొక్కసారి షేర్‌హోల్డర్స్‌కు భరించలేనంత నష్టం వాటిల్లుతుంది. షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి విషయంలో ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. అందులో నిర్ధారిత వడ్డీ లేదని, లాభనష్టాలలో భాగముంది గనక అది ధర్మసమ్మతమే నని కొందరు అంటారు. మరి కొంతమంది పండితుల అభి ప్రాయం ప్రకారం షేర్‌మార్కెట్ జూదంతో కూడిన ఒక పెద్ద వ్యా పారం అయిపోయింది. మధ్యలోనే కొందరు దళారీలు డబ్బులు తీసుకుని పరారవుతారు. సామాన్యజనుల సంపాదన నిమిషాలలో కొల్లగొట్టబడుతుంది. నిన్నటి వరకూ ధనికులుగా ఉన్నవారు కాస్తా దివాలా తీసి రోడ్డున పడతారు.షేర్‌మార్కెట్‌లలో నష్ట పోయిన సొమ్మును తిరిగి వాపసుచేసే వ్యవస్థ లేదు. రెండో విష యం ఏమంటే కంపెనీ ఎటువంటి వ్యాపారం చేస్తున్నదో షేర్ హోల్డర్స్‌లకు తెలియదు. కంపెనీలు అధర్మమైన వ్యాపారాలు చేసి వచ్చే లాభాల్ని షేర్‌హోల్డర్స్‌లలో పంచుతాయి. మూడో విషయం ఏమిటంటే కొన్ని కంపెనీల యొక్క లాభనష్టాలలో మోసం జరుగుతుంది. ఉదాహరణకు కంపెనీ నష్టంలో ఉంటే లాభం ఉందని ప్రచారం చేయటం, నష్టంలో పూర్తిగా మునిగిపోయిన పుడు షేర్‌హోల్డర్స్‌లకు తెలుస్తుంది జీవితమొత్తం కష్టార్జితం నట్టేటా మునిగిపోయిందని! కొందరు ఆసుపత్రికి చేరితే మరి కొందరు సమాధికి చేరుతారు.

కొంతమంది పండితులు క్రింద ఇవ్వబడిన షరతులప్రకారం కంపెనీయొక్క షేర్స్ కొనవచ్చని అనుమతినిచ్చారు. 1) కంపెనీ యొక్క వ్యాపారం హలాల్ అయి ఉండాలి. 2)వడ్డీతో ఎటువంటి సంబంధం ఉండకూడదు. 3) వడ్డీతో సంబంధమైన బ్యాంకులతో ఎటువంటి సంబంధం ఉండకూడదు.

వాయిదాల పద్ధతిపై క్రయ విక్రయాలు

ఈ కాలంలో జీవితానికి అవసరమైన వస్తువులు కిస్తుల్లో తీసుకో వటం సర్వసాధారమైపోయింది. నగదుపై కొనే స్థోమత లేనివాడు కిస్తుల్లో కొంటాడు, కంపెనీకి ప్రతినెలా నిర్ణీత సొమ్ము చెల్లిస్తాడు, కొనే ధరకంటే కిస్తుల్లో కొనే ధర ఎక్కువగా ఉంటుంది. కాని నగదుపై కొనే స్థోమత లేనివారి కోసం చాలా సులభం అవు తుంది. ఈ విధంగా వాయిదాల పద్ధతిపై కొనే విషయం గురించి షేఖ్ అబ్దుల్లాహ్ బిన్ బాజ్(ర)ను ప్రశ్నించడం జరిగింది:

ప్రశ్న: వాయిదాల పద్ధతిపై ధరలు ఎక్కువ చేసి వాహనాలు అమ్ముతారు ఉదాహరణకు నదగుపై 15000 రియాల్‌కు కొనే వాహనం కిస్తుల్లో తీసుకుంటే ఎక్కువ ధర తీసుకోవడం జరుగు తుంది. ఇది వడ్డీతో సమానం కాదా?

జవాబు: కాలపరిమితి, కిస్తుల సంఖ్య నిర్ధారించినట్లయితే వాయిదాల పద్ధతిపై లావాదేవీలు చేయటంలో తప్పు లేదు, కిస్తుల వలన ధర ఎక్కువయినా సరే, అమ్మే కొనే వారిద్దరికీ లాభం ఉంది గనుక. అమ్మేవానికి ధర ఎక్కువ వస్తుంది కొనే వానికి సమయం దొరుకుతుంది. హజ్రత్ ఆయిషా(ర) 9 ఏండ్ల వ్యవధిలో వాయిదాల పద్ధతిపై నిర్ధారిత సొమ్మును చెల్లించే షరతుపై హజ్రత్ బరీర(ర)ను కొని విడుదల చేశారు. ఏటేటా 40 దిర్హములు చెల్లించాల్సి ఉండింది. దీని ఆధారంగా తెలిసేదేమి టంటే వాయిదాల పద్ధతిపై క్రయవిక్రయాలు జరపటం ధర్మసమ్మ తమే. పైగా ఈ రకమయిన వ్యవహారంలో మోసంగానీ, వడ్డీగానీ లేదు. కాబట్టి ఇతరత్రా క్రయవిక్రయాల మాదిరిగానే ఇదీ షరీఅత్ బద్ధమే. (ఫతావా షేఖ్ బిన్ బాజ్–230) **(ఇంకా ఉంది)**

JUN 2012.indd 23 6/4/12 12:26 PM



హాట్ సాలెడ్

కావలసిన సామగ్రి:

1. ఉల్లి గడ్డ (తెలుపు) నిలువుగా కోయబడినది
2. చప్పటి మిరపకాయలు ఎరుపు, పసుపు పచ్చ మరియు ఆకుపచ్చ రంగువి.
3. వంకాయలు నిలువునా తరిగినవి.

సోస్:

1. సోయా సోస్ 1/4 (పావు) గ్లాస్
2. 3 స్పూన్లు కెచప్
3. హాట్ సాస్ 2 స్పూన్లు

అన్నింటినీ కలపాలి

తయారు చేయు విధానము:

1. తరిగిన ఉల్లిపాయలు నూనెలో మెత్త పడునంత వరకు వేపాలి.
2. చప్పటి మిరపకాయలు అన్నియు నూనెలో మెత్త పడేంత వరకు వేపాలి.
3. వంకాయలు మెత్త పడేంత వరకు నూనెలో వేపాలి.

వీటన్నింటినీ కాస్త చల్ల పడేంత వరకు ప్రక్కకు పెట్టి, సర్వింగ్ ట్రేలో అన్నింటినీ కలుపుకుని వాటిపై సోస్ పోయాలి.

సాలెడ్ సబారూ

కావలసిన సామగ్రి:

1. వంకాయ రంగు కేబేజి
2. తెలుపు రంగు కేబేజి
3. అమెరికన్ సాలెడ్
4. ఒక డబ్బా మొక్క జొన్న
5. తెలుపు ఉల్లి గడ్డ
6. క్యూకుంబరు (తినే దోసకాయ)
7. టమాటాలు
8. చికెన్(కోడి)

వద్దు....మనకొద్దు..!

పుణ్యాలు చేసి పునీతుడననుకోకు
నమాజులు చేసి నవనీతుడననుకోకు
పంచగవయ్యా తినేసి-పాపవిముక్తుడననుకోకు
దేహాన్ని బాప్తిస్మా, గంగాజలంతోకాదు
మనోమాలిన్యాన్ని కడుగు కన్నీటి ధారతో

నీవు చేస్తున్న అక్రమాలన్నింటికీ
ప్రకృతి రిపోర్ట్ తయారు చేస్తున్నది
నీ కుటిల నీతికి బంధననిబంధనలేవో
సివిల్ కోడులో టిక్కు పెట్టుకుంటున్నది
రేపు ప్రళయ దినాన నీపై చర్య తీసుకోక తప్పదు
నీ కర్మల ఫలితం దక్కే వరకు విధి ఒప్పదు

అందుకని మాకెందుకు సోదరా!
సినిమాలూ వద్దు, సిత్రాలూ వద్దు
షరాబులూ వద్దు, కబాబులూ వద్దు,
పరపొందూ వద్దు, పరాయి సొమ్ము వద్దు
హరిణి హింసా వద్దు, గృహిణి హింసా వద్దు
ఎయిడ్స్ రోగాలూ వద్దు, సార్స్ భోగాలూ వద్దు
లంచాల లంచూ వద్దు, వడ్డీల విందూ వద్దు
భూస్వామ్య గున్యా వద్దు, నాస్తిక డెంగ్యూ వద్దు

వద్దు...వద్దు...ప్లీజ్ మాకొద్దు!
ఐహిక లాలసే వద్దు, ధన పిపాసే వద్దు
కామ దృష్టే వద్దు, సీమ భ్రష్టే వద్దు
మారణహోమమే వద్దు, మారణాయుధాలే వద్దు
ఇదెరిగినవారు కద్దు, గురెరిగి చేయి రద్దు
ఇదే దైవ హద్దు, దాటకు ఈ సరిహద్దు

ముఖ్య ప్రకటన

IPC స్త్రీల విభాగానికి ధర్మప్రబోధకురాలి అవసరం ఉంది.

అర్హత:

- ధార్మిక విద్యను ఆర్జించి ఉండాలి.
- మాతృ (తెలుగు) భాషతోపాటు అరబీగానీ, ఆంగ్లం గానీ చదవడం మరియు వ్రాయడం వచ్చి ఉండాలి.
- అకామా ఉండాలి.

మీ సివిని ఫ్యాక్స్ (22512257) ద్వారా లేదా ఈమెయిల్ (ipc-sch@yahoo.com) ద్వారా పంపగలరు.

JUN 2012.indd 24 6/4/12 12:26 PM

మానవాళికి దైవభీతినీ, నైతిక రీతిని ఉపదేశించడానికి ఆవిర్భవించిన అసంఖ్యాక మానవ రత్నాల రాసిలో అగ్రజులు మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం). దైవ విశ్వాసం గల ఒక విశ్వాసి, ఒక ఉద్యోగి, ఒక యజమాని, ఒక కార్మికుడు, ఒక న్యాయాధిపతి, ఒక సైనికుడు-అందరూ వారి జీవితాల్లో ప్రతినిత్యం ప్రవక్త ముహమ్మద్ (స) వారి ఆదర్శాలు ప్రతిబింబించాలని మనస్ఫూర్తి గా కోరుకుంటారు. ఆయన (స) పట్ల మనకున్న ప్రేమ మన జాతిపౌర జీవితంలో, పరిపాలనా వ్యవస్థలో, ఆచారవ్యవహారాలలో కన్పించాలి. లేకుంటే అది నిజమైన ప్రేమ కాదు. ఆయన (స) పట్ల మనం కలిగి ఉండాల్సిన మార్యదల గురించి తెలుసుకుందాం.

మహోన్నత శీల శిఖరం మహా ప్రవక్త ముహమ్మద్ (స)



మేము అల్లాహ్ తర్వాత సర్వలోకాలలో అందరికంటే ఎక్కువగా ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారిని అభిమానిస్తాము. ఆయన వంశీయులను, ఆయన సహాబాను, ఆయన్ను అభిమానించే ప్రతి వ్యక్తినీ ప్రేమిస్తాము.

మేము ఆయన్ను మా తల్లిదండ్రులకంటే, గురువుల కంటే ఎక్కువగా గౌరవిస్తాము. ఆయన పేరు విన్న వెంటనే ఆయనపై దరూద్ పంపిస్తాము.

దేని గురించి ఆయన ఆదేశించారో వాటిని పాటిస్తాము. వేటి గురించి ఆయన నివారించారో, హెచ్చరించారో వాటికి దూరంగా ఉంటాము. ఆయన పలికి ప్రతి మాట సత్యమని విశ్వసిస్తాము.

ఆయన అడుగుజాడల్లో మా ఇహపరాల సాఫల్యం దాగుందని, ఆయన ఆదర్శాలే మాకు శిరోధార్యాలని, ఆయన అనుసరణలోనే సకల సౌభాగ్యాలు ఇమిడి ఉన్నాయని, ఆయనకు మిమచిన ఆదర్శం ఈ జగాన మరొకటి లేదని మనస్ఫూర్తిగా నమ్ముతాము. ఏ విషయంలోనూ ఆయన సంప్రదాయానికి వ్యతిరేకంగా నడుచుకోము. మా తన, ధన, మానాలు పణంగా పెట్టాల్సి వచ్చినా ఖాతరు చేయక మేము ఆయన బాట లోనే నడుస్తాము.

ఆయన ఇష్టపడిన వాటన్నింటినీ మేమూ ఇష్ట పడతాము. ఆయన ద్వేషించిన ప్రతిదాన్నీ మేమూ ద్వేషిస్తాము.

మా మధ్య ఏదేని విషయంలో విభేదాలు తలెత్తితే అల్లాహ్ గ్రంథాన్ని మరియు ఆయన ఆదర్శాన్ని చివరి తీర్పుగా భావిస్తాము. ఆయన చేసిన తీర్పు న్యాయబద్ధమయినదిగా, సత్యబద్ధమయినదిగా నమ్ముతాము. ఆయన ఇచ్చిన తీర్పు పట్ల మా హృదయాలలో ఏ విధమయినటువంటి శంకకు, సందేహానికి తావియ్యము.

ప్రపంచంలోని కుత్సిత మతులన్ని కూడబలుక్కొని కుట్రలు పన్నినా, మురికి మనస్కులు ఆయన (స) పవిత్ర జీవితం మీద బురదజల్లేందుకు ప్రయత్నించినా ఆయన (స) పట్ల మాకున్న అభిమానం ఇసు మంత యినా తగ్గదు. మా పరువుప్రతిష్ఠలకన్నా అధి కంగా ఆయన (స) కీర్తిమర్యాదల్ని కాపాడుతాము.

నితరం ఆయన అగుజాడలే మాకు వెలుగు నీడలు. రేపు ప్రళయ దినాన ఆయన సిఫారసు మాకు లభించాలని, జన్నతుల్ ఫిర్‌దౌసిల్ ఆలాలో ఆయన సహచర్య భాగ్యం మాకు ప్రాప్తించాలని ఆ పర మోన్నత ప్రభువును వేడుకుంటాము.

JUN 2012.indd 25 6/4/12 12:26 PM

విజయం మనదే; కానీ....!

1) STOP WORRYING: చింతలకు స్వస్తి చెప్పండి - జరిగిపోయిన దాని గురించి గానీ, జరగబోయే దాని గురించిగానీ చింత పడటం మానుకోవాలి. దాని వల్ల మంచి కన్నా చెడే ఎక్కువ జరుగుతుంది. కొత్త ఆలోచనలను, సృజనాత్మకతను కోల్పోతాము.

2) ENERGIZE YOURSELF: శక్తిసామర్థ్యాలను పెంచుకోండి - ఎప్పటికప్పుడు మనల్ని మనం ఉత్తేజ పర్చుకుంటూ, మనలోని స్కిల్స్‌ను పెంచుకునే ప్రయత్నం చేయాలి. నిరాశ నిస్పృహలకు లోను కాకూడదు.

3) LOVE YOURSELF: స్వీయ గౌరవం - "IF YOU DON'T RESPECT YOURSELF, DON'T EXPECT OTHER TO RESPECT YOU"

మనల్ని మనం గౌరవించుకోనప్పుడు, ఇతరులు మనల్ని గౌరవిస్తారనుకోవడం అవివేకం అవుతుంది. కాబట్టి మనల్ని మనం ఏనాడు తక్కువగా అంచనా వేసుకోకూడదు. మన వ్యక్తిత్వాన్ని, మన కుటుంబాన్ని, మన మత ధర్మాన్ని, మన పరిసరాల్ని, దేశాన్ని మనం ప్రేమించాలి.

4) FEEL ASSERTIVE: నిక్కచ్చిగా ఉండండి - మొహమాటానికి పోయి మొదటికే మోసం తెచ్చుకో కూడదు. నిర్మోహమాటంగా, నిర్భయంగా చెప్పదలచుకున్నది సూటిగా, స్పష్టంగా చెప్పాలి. మనం తప్పు చేస్తే తప్ప, మనల్ని చులకన చేసే హక్కు ఎవరికీ లేదు.

5) EXCUSE CRITICS: విమర్శకులను క్షమించండి -మనం ఎందులోనూ పరిపూర్ణులం కాదు కాబట్టి మనం చేసింది మంచి పనే అయినా విమర్శించేవారు కొందరు ఉండనే ఉంటారు. తప్పు ఉంటే దిద్దుకోవాలి. లేదంటే క్షమించాలి.

6) BE SELF CONFIDENCE: మన వెంట ఎవరున్నా లేకపోయినా ఆత్మవిశ్వాసం ఉండాలి. బ్రతుకు బండిని నడిపే ధనం లేకపోయినా ఫర్వాలేదు ధర్మ రథాన్ని లాగగలిగే ధైర్యం ఉండాలి. మన మీద మనం విశ్వాసాన్ని పెంచుకోవాలి.

7) THINK POSITIVE: సాత్విక దృక్పథం అలవర్చుకోండి - సకారాత్మకంగా, సానూకూలం గా ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. నకరాత్మక ఆలోచనల వల్ల ఎన్నో సమస్యల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

8) EXCEL YOURSELF: అద్భుతాలు చేయండి - జీవితంలో మనం సాధించిన చిన్న చిన్న విజయాలతో తృప్తి చెందకూడదు. మరిన్ని గొప్ప కార్యాలు చేసేందుకు ప్రయతిస్తూనే ఉండాలి.

9) EVALUATE YOURSELF: మీ స్థాయిని గుర్తించండి - లక్ష్యసాధనలో మన వల్ల తెలిసో తెలియకో తప్పులు జరగవచ్చు. వాటిని ఇతరులు అలుసుగా తీసుకోవచ్చు. కాబట్టి ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని బట్టి మారడానికి ప్రయత్నించాలి. ఆత్మస్తుతికి స్వస్తి పలికి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఎప్పటికప్పుడు మన బలగాలను, బలహీనతలను బేరీజు వేసుకుంటూ ఉండాలి.

10) MOTIVATE YOURSELF: ప్రేరణ కలిగించుకోండి - స్వీయ గౌరవానికి ఇది వెన్నుముక లాంటిది. ఎవరో వస్తారనీ ఏదో ప్రేరణ కలిగిస్తారని ఎదురు చూడటం నిష్ప్రయోజనం అన్న సత్యాన్ని గుర్తించి స్వయం ప్రేరణ కలిగించుకోవాలి. విజయం మనదే.